# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 271 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 31 జనవరి 2026 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 271 31-01-2026 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## 11 నుంచి అసెంబ్లీ

**అమరావతి జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం విడుదల చేశారు. 11వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అదేరోజు గవర్నర్ అసెంబ్లీలో ప్రసంగించనున్నారు. 14న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల

- తరువాయి 2లో..

# ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4



- సమాజానికి కొంత తిరిగి ఇచ్చినప్పుడే నిజమైన సంతృప్తి
- జన్మభూమికి ప్రవాసాంధ్రుల సేవలు స్ఫూర్తిదాయకం
- పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టులి
- పదేళ్లలో గుంటూరు సహా అమరావతి రూపురేఖలు మారతాయి
- గుంటూరు జీజీహెచ్ లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రూ.100 కోట్ల విరాళం సమకూర్చిన గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులకు సీఎం అభినందన

**గుంటూరు, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎంత ఎదిగినా జన్మభూమిని మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత సమాజసేవకు వినియోగిస్తే వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేనిదని సీఎం అన్నారు. గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కాసూరి-జింఖానా మాతా శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణం కోసం కాలేజీ పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళాలను సమకూర్చగా... ఎక్విప్మెంట్, ఫర్నిచర్ కోసం రూ. 27 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'సమాజంలో ఇంకా మంచి మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా నలభై, యాభై ఏళ్ల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడినవాళ్లు జన్మభూమిని మర్చిపోతారు. కానీ మీరంతా చదువుకున్న కాలేజీని గుర్తు పెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థ ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్నారు. అందుకు మీ అందర్నీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఆరోగ్య కేంద్రం నిర్మాణంతో పాటు భవిష్యత్ లో దాని నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం గొప్ప విషయం. మనతో పాటు సమాజం కూడా బాగుండాలన్నదే మన సంస్కృతి. ఇప్పటి వరకూ పాఠశాలలకు, ఆస్పత్రులకు, దేవాలయాలకు, సత్రాలకు, ఆట స్థలాలకు ఎంతోమంది దాతలు పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చారు. మనదేశ సంస్కృతి, సంప్రదాయాలు మరే దేశంలోనూ కనిపించవు. అమెరికాలోనైతే 18 ఏళ్లకే పిల్లలు బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తారు. కానీ మనదేశంలో పిల్లలు ఎంత పెద్దవారైనా జీవితాంతం వారిని తల్లిదండ్రులు కనిపెట్టుకునే ఉంటారు. 1995లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మెడిసిన్ చేసిన ఎంతోమంది అమెరికా వెళ్లేవాళ్లు. ఇది చూసి చాలామంది నాతో..బ్రెయిన్ డ్రెయిన్ అవుతోందన్నారు. రాబోయే రోజుల్లో బ్రెయిన్ గెయిన్ అవుతుందని వారికి చెప్పాను అని ముఖ్యమంత్రి అన్నారు.



**పేదల అభ్యున్నతి కోసం పీ4**

నేను జన్మభూమి కార్యక్రమానికి పిలుపునిచ్చినప్పుడు ఎంతోమంది ప్రవాసాంధ్రులు తాము పుట్టి పెరిగిన ఊరికి సాయం చేసేందుకు ముందుకొచ్చారు. మనందరం గ్రామీణ ప్రాంతాల్లో చిన్న కుటుంబాల్లో పుట్టినవారమే. అవకాశాలు అందిపుచ్చుకుని అంచెలంచెలుగా ఎదిగాం. రహదారులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ రంగంలో వేగవంతమైన అభివృద్ధికి పీ4 మోడల్ సరైందని కేంద్రం భావిస్తోంది. అయితే ధనిక, పేదల మధ్య వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. నేను అందుకే పేదల అభ్యున్నతి కోసం పీ4 తీసుకొచ్చాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయి. చదువు అనేది గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలామ్ ఆర్థిక సాయంతోనే అత్యున్నత స్థాయికి ఎదిగారు.

పీ4 కార్యక్రమం లక్ష్య సాధనలో 50 శాతం రీచ్

- తరువాయి 2లో..

## గాంధీజీ బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మహాత్మా గాంధీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా విధానంతో కోట్ల మంది దేశ ప్రజలను ఒక్కతాటిపై నడిపి గాంధీజీ స్వాతంత్ర్యం సాధించారని ఈ సందర్భంగా సామాజిక మాధ్యం ఎక్స్‌లో పేర్కొన్నారు. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి ఆయన ఆశయాలను నిజం చేసేందుకు కృషి చేద్దామని సూచించారు.

**టిడిపి కార్యాలయంలో గాంధీజీ వర్ధంతి**

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. గాంధీజీ చిత్రపటానికి పార్టీ కార్యాలయ కార్యదర్శి పి అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింసా ఎప్పటికీ ఆచరణీయమని ఈ సందర్భంగా అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పోషించిన పాత్ర అద్వితీయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు సూర్యప్రకాష్, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిట్ ఛార్జ్‌షీట్‌లో కల్తీ నెయ్యి స్పష్టం

## మీడియాతో టిటిడి చైర్మన్





**తిరుపతి, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై క్లీన్ చిట్ అంటూ యాత్రికులను మోసం చేస్తున్నారని, టిటిడి పవిత్రతను భ్రష్టు పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు చెప్పారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ నెయ్యి కల్తీ జరగలేదని చెప్పడం వాస్తవం కాదని, సిట్ ఛార్జ్‌షీట్‌లోనే కల్తీ స్పష్టంగా నమోదయిందని పేర్కొన్నారు. నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, కొందరికి లాభం చేకూర్చేలా నిబంధనలను మార్చారని ఆరోపించారు. సరైన సామర్థ్యం లేని సంస్థలకు నెయ్యి టెండర్లు అప్పగించారని తెలిపారు. సుమారు రూ.250 కోట్ల 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి కొనుగోలు జరిగిందని ఆరోపించారు. ఈ నెయ్యిని పరీక్షించిన ఎన్‌డిడిబి జంతు కొవ్వు ఉందని నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. ఒక్క ఆవు కూడా లేకుండా, చుక్క నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి తయారు చేశామని చెప్పడం అబద్ధమని, నెయ్యి తయారీలో వాడిన కొన్ని రసాయనాలు అత్యంత ప్రమాదకరమైనవని ఆయన చెప్పారు. ఈ కల్తీ నెయ్యితో సుమారు 20 కోట్ల లడ్డూలు తయారు చేయడం ద్వారా తిరుమల క్షేత్ర పవిత్రతకు తీవ్రమైన భంగం కలిగించారన్నారు. కమీషన్ల కోసమే కొన్ని డెయిరీలను ఎంపిక చేశారని విమర్శించారు. నెయ్యి నాణ్యతపై తుది నిజాలు వెలుగులోకి రావాలంటే మైక్రో డిఎన్ఎ టెస్ట్ తప్పనిసరిగా నిర్వహించాలని

- తరువాయి 2లో..

## ప్రజల సంతోషం.. సంక్షేమమే ధ్యేయంగా

# పని చేద్దాం...

- కూటమి ప్రభుత్వం నిబద్ధత, పారదర్శకతతో ముందుకు వెళ్తుంది
- విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించం
- నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైనా, పని పట్ల నిర్లక్ష్యం వహించినా కఠినంగా వ్యవహరిస్తాం
- చిత్తశుద్ధి, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించండి
- గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను నిర్వీర్యం చేసింది
- వేల కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసింది
- పంచాయతీరాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దేందుకు మీ సహకారం కావాలి
- విశాఖలో నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యు ఎస్, పి ఆర్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్



**విశాఖపట్నం జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

'ప్రజలు ఎన్నో ఆశలతో కూటమిని గెలిపించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మేమంతా పని చేస్తున్నాం. ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలన్న తపనతో ముందుకు

- తరువాయి 2లో..

## ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచిని

# ప్రజల్లోకి తీసుకెళ్లండి

- పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండండి
- కూటమి నాయకుల మధ్య సఖ్యత ముఖ్యం.. కలిసికట్టుగా పని చేయండి
- 11వ బ్యాచ్ క్యాడర్ శిక్షణలో పాల్గొన్న నేతలకు మంత్రి లోకేష్ సూచనలు

**మంగళగిరి జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వార్డు, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల కోసం నిర్వహించిన 11వ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన విస్తృతంగా మాట్లాడారు. పార్టీ క్యాడర్ సమన్వయంతో పాటు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని లోకేష్ స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా ఓర్పుతో, ఐక్యంగా దుష్ప్రచారాలను ఎదుర్కోవాలని

2లో..





# ఉగాదికి జాబ్ క్యాలెండర్!

- ఉగాది నాటికి జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు
- వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల వివరాల సేకరణపై దృష్టి
- ఆర్థిక భారాన్ని అంచనా వేసిన తర్వాతే తుది ప్రకటన

**అమరావతి జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




ఏపీలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తీపికబురు అందించేందుకు సిద్ధమవుతోంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది నాటికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకుని కసరత్తు ముమ్మరం చేసింది. దీని కోసం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రతి ఏటా ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను గుర్తించి, వాటి భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం అన్ని శాఖల నుంచి ఖాళీల జాబితాను తెప్పించుకుంటోంది. అయితే, కొత్త ఉద్యోగాల భర్తీ వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక భారాన్ని కూడా జాగ్రత్తగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాకే జాబ్ క్యాలెండర్‌పై తుది ప్రకటన చేయనున్నారు.

**ఇటీవల 16 వేల టీచర్.. 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ**

గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో పాటు 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. ఇప్పుడు కొత్త జాబ్ క్యాలెండర్‌ను పకడ్బందీగా

- తరువాయి 2లో..

# ఏపీ జెన్కోలో 27 మందికి కారుణ్య నియామక పత్రాలు..

- కారుణ్య నియామకాలతో బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటోందిలి
- గత ప్రభుత్వం అర్హులకు ఇంజనీర్ స్థాయి ఉద్యోగాలు ఇవ్వలేదులి
- కూటమి వచ్చాక విద్యుత్ శాఖలో 500కు పైగా కారుణ్య నియామకాలులి
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లి



**అమరావతి జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కారుణ్య నియామకాలతో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ శాఖకు సంబంధించి జరిగిన వివిధ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సచివాలయంలోని మంత్రి గొట్టిపాటి రవి కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 27 మంది లబ్దిదారులు మంత్రి గొట్టిపాటి, సీఎస్ విజయానంద్ చేతుల

- తరువాయి 2లో..

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

# విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

**ఇన్నోవేషన్లకు ప్రోత్సాహం, స్టార్టప్‌లకు అండ : ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అగస్త్య అకాడమీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు**

అమరావతి జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విద్యార్థులు వినూత్నంగా ఆలోచన చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వినూత్న ఆలోచనలకు భవిష్యత్తులో మంచి అవకాశాలు దక్కుతాయని తెలిపారు. అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆయన కుప్పం నియోజకవర్గానికి శుక్రవారం మధ్యాహ్నం వచ్చారు. తొలి రోజు పర్యటనలో భాగంగా గుడిపల్లి మండలంలో ఆగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రాంగణంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన టీచర్ ట్రైనింగ్ సెంటర్‌ను చంద్రబాబు ప్రారంభించారు. రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వసతి సౌకర్యం కేంద్రానికి, రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఒబెరారు విజిటర్స్ సెంటర్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలు, విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికాంశాలపై అందిస్తోన్న శిక్షణపై వీడియో ప్రదర్శనను విద్యార్థుల మధ్యలో కూర్చొని ముఖ్యమంత్రి తిలకించారు. ఆగస్త్య విద్యాచల్ అకాడమీలోని ఆడిటోరియంలో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్లకు ప్రోత్సాహం అందిస్తామని, స్టార్టప్‌లకు అండగా ఉంటామని అన్నారు. 'విద్యార్థులు ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి. భవిష్యత్ మనదే. రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త ఆవిష్కరణలు వస్తాయి. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్ కంపెనీలకు అవకాశాలు దక్కేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టాం. డ్రోన్, స్పేస్ సిటీ వంటి వాటితో భవిష్యత్‌లో రాష్ట్రాన్ని అభివఅద్ధి చేస్తాం. భవిష్యత్ భారతదేశం ఎలా ఉండబోతోందనే అంశంపై విద్యార్థులు కూడా అవగాహన పెంచుకోవాలి. రాష్ట్రంలో జరుగుతున్న అభివఅద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను గమనించాలి. విద్యుత్ రంగంలో మార్పులు వస్తున్నాయి. విద్యుత్ కొనుగోళ్ల ఛార్జీలు తగ్గించగలిగాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటే విద్యుత్ ఛార్జీలను తగ్గించవచ్చు. కుప్పాన్ని ప్రయోగశాలగా చేస్తున్నాను. ఇక్కడికి అన్ని రకాల టెక్నాలజీలను తెస్తున్నాం. హంద్రీ-నీవా ద్వారా కుప్పం వరకు నీళ్లను తెచ్చాం. నీటి భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. నీటి సంరక్షణ విషయంలో ఆగస్త్య అకాడమీ ప్రతినిధులు వినూత్నంగా ఆలోచన చేయాలి' అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిణామాలను అందిపుచ్చుకోవడం వల్లే ఐటి రంగంలో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వాళ్లు విస్తరించారని వివరించారు. అప్పట్లో ఐటిని ప్రమోట్ చేశానని, ఇప్పుడు ఎఐ గురించి అందరూ ఆలోచన చేయాలని చెబుతున్నానని తెలిపారు. నీటి సంరక్షణ, నీటి సద్వినియోగం విషయంలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టు చేపడదామన్నారు. శిక్షణ తీసుకుంటున్న ఉపాధ్యాయులను చంద్రబాబు పలకరించారు. రకరకాల కిట్లతో టీచర్ ట్రైనింగ్ ఇస్తున్న విధానాన్ని పరిశీలించారు. పిల్లలకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధన ఏ విధంగా చేయాలనే అంశంపై శిక్షణ తీసుకుంటున్నట్టు ముఖ్యమంత్రికి టీచర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్‌టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పీడి వికాస్ మరమ్మత్, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్, రెస్కో చైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్ ఆర్ఆర్ రవి పాల్గన్నారు.



# మేడారం జనసంద్రం.. పోటెత్తిన భక్తజనం


**గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ**
**వనదేవతల దర్శనానికి పోటెత్తిన భక్తజనం**
**నేడు మేడారం వెళ్లనున్న తెలంగాణ గవర్నర్**
**కరెంట్ కోతలతో ఉద్రిక్తత.. మంత్రి కారు ధ్వంసం**
**వీఐపీలకే ప్రాధాన్యమంటూ పోలీసులపై విమర్శలు**

హైదరాబాద్ జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మేడారం మహా జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వన దేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో మేడారం పరిసరాలు జనసంద్రంగా మారాయి. భారీగా తరలివచ్చిన భక్తులను నియంత్రించడం అధికారులకు సవాలుగా మారింది. మరోవైపు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నేడు మేడారం సందర్శించి, వన దేవతలకు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయన పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలపైకి చేరడంతో గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు తమ మొక్కులు చెల్లించుకోవడం ప్రారంభించారు. అయితే, గురువారం రాత్రి జాతర ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన కొందరు భక్తులు, అక్కడే ఉన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కారు అద్దాలను, సమీపంలోని దుకాణాలను ధ్వంసం చేశారు. ఈ నెల 28న ప్రారంభమైన ఈ జాతర 31న ముగియనుంది. జాతరకు వీఐపీలు, వీవీఐపీలు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో 25 మంది ఐపీఎస్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అయితే, పోలీసులు వీవీఐపీలు, వారి కుటుంబాల సేవకే పరిమితమై సామాన్య భక్తుల రద్దీని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ వన దేవతలను దర్శించుకున్నారు.



## గ్రూప్-1 ఫలితాలు విడుదల



అమరావతి, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) గ్రూప్-1 ఫలితాలను విడుదల చేసింది. 2023లో 89 పోస్టుల భర్తీ కోసం ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టులకు ఎంపికైన తుది అభ్యర్థుల జాబితాను కమిషన్ కార్యదర్శి రవిపటాన్ సుభాష్‌శెట్టి శుక్రవారం విడుదల చేశారు. 81 పోస్టుల్లో 79 పోస్టులకు అర్హత సాధించారు. స్పోర్ట్స్ కోటాపై హైకోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో పోలీస్ సర్వీస్‌లోని ఒక డిఎస్‌పి పోస్టు, ఎపి స్టేట్ ట్యాక్స్ సర్వీస్‌లో ఒక అసిస్టెంట్ కమిషనరు పోస్టుకు అభ్యర్థులను ప్రకటించలేదు. అర్హత పొందిన అభ్యర్థుల వివరాలను షషష.జూరష.ఖజూ.స్త్రశీజ.ఱఅలో పొందుపరిచినట్లు కార్యదర్శి వెల్లడించారు

# హైదరాబాద్‌లో దారుణంగా పడిపోయిన గాలి నాణ్యత

**బెంగళూరు, చెన్నై వంటి మెట్రో నగరాలను కూడా అధిగమించిన హైదరాబాద్**

**మోస్ట్ పొల్యూటెడ్ సిటీగా మారుతున్న హైదరాబాద్**

హైదరాబాద్ జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గాలి నాణ్యత సూచీ ప్రకారం.. నగరంలోని పలు ప్రాంతాల్లో పీఎం 2.5, పీఎం 10 కణాలు అనుమతించదగిన స్థాయి కంటే 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా నమోదవుతునట్లు తాజాగా వెల్లడించిన పొలూషన్ కంట్రోల్ బోర్డ్ ఇటీవల సికింద్రాబాద్ పరిధిలో గాలి నాణ్యత సూచీ అత్యంత ప్రమాదకరంగా 240కి చేరుకోగా.. పొలూషన్ కంట్రోల్ బోర్డ్ నివేదిక ప్రకారం, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉందని వెల్లడి....



# 11 నుంచి అసెంబ్లీ

కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మార్చి 12వ తేదీ వరకు సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4

అయ్యాం. 10 లక్షల 42 వేల మందిని లక్షా 2 వేల మంది దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

**దాతృత్వం గొప్పది**

'గుంటూరు మెడికల్ కాలేజీలో చదివిన వారిలో 8 మందికి పద్మశ్రీలు రావడం గొప్ప విషయం. మన రాష్ట్రంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ తర్వాత ఏర్పాటైన రెండవది గుంటూరు మెడికల్ కాలేజీనే. జీజీహెచ్ లో మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని 2,69,245 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 5 అంతస్తుల్లో ఏర్పాటు చేశారు. మొత్తంగా 600 బెడ్లు ఈ బ్లాకులో ఉన్నాయి. ప్రసూతి విభాగం 300 బెడ్లు, పిడీయాట్రిక్స్ విభాగంలో 200 బెడ్లు, ఇక చీ×జఖ, ూ×జఖ,ూ×జఖ వంటి విభాగాల్లో మిగిలిన బెడ్లు ఉన్నాయి. నిర్మాణం కోసం డాక్టర్ గవిని ఉమాదేవి రూ.22 కోట్లు, నళిని-వెంకట్ తేళ్ల రూ.8 కోట్లు, వాసిరెడ్డి రమాదేవి-కొండ్రగుంట వెంకట్రావు రూ. 4.32 కోట్లు, మొవ్వ వేదవతి-వెంకటేశ్వరరావు రూ. 4.04 కోట్లు, డాక్టర్ తేలికిచర్ల-గుడిమెడ కుటుంబాలు రూ. 3.60 కోట్లు, డాక్టర్ లక్ష్మీ-చౌదరి గంగ రూ.3.40 కోట్లు, బీనా నూతక్కి-గోపాలరావు రూ.3.20 కోట్లు ఇచ్చారు. పూర్వ విద్యార్థులు ఈ బ్లాక్ నిర్మాణంతో పాటు... గతంలో రూ.35 కోట్లను వెచ్చించి ఆడిటోరియం నిర్మించారు తులసీ సీడ్స్ సహా పలువురు దాతలు ముందుకొచ్చారు. గుంటూరు ఎంపీ , కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకూ విరాళాలు సేకరించి పనులు పూర్తి చేస్తున్నారు. నాట్కో కూడా 2017-18లో రూ. 47 కోట్లు , ఈ ఏడాది రూ.18 కోట్లు, క్యాన్సర్ చికిత్సకు రూ. 18 కోట్లు, ఇతరత్రా అవసరాలకు రూ. 12 కోట్లు ఖర్చు చేశారు. అలాగే గుంటూరులో మిలినియమ్ బ్లాక్ కోసం రూ. 16 కోట్లు, విశాఖ ఏయూ మెడికల్ కాలేజీ బ్లాక్ నిర్మాణం కోసం రూ. 60 కోట్లు, కాకినాడ ఆస్పత్రికి రూ. 40 కోట్లు, కర్నూలు మెడికల్ కాలేజీకి రూ, 20 కోట్లు ఖర్చు చేయడం అభినందనీయం.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**మేటి నగరంగా అమరావతి**

అమరావతి నూతన గ్రీన్ ఫీల్డ్ నగరంగా అవతరిస్తోందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సర్వేలో స్పష్టం చేసింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2038 నాటికి ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం తయారవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో మనం ముందుకెళ్తున్నాం. రాజధానికి అంత భూమి ఎందుకు, 100 ఎకరాల్లో సచివాలయం కట్టేస్తే చాలని ఎంతోమంది అన్నారు. కానీ జాతికి గుర్తింపు లభించాలన్నా, అన్ని ప్రాంతాలతో సమానంగా మనం ఉండాలన్నా అభివృద్ధి చెందాలి. కర్ణాటక రాష్ట్రానికి బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై , తెలంగాణకు హైదరాబాద్ నగరాలున్నాయి. మనం అమరావతిని చిన్న నగరంగా వదిలేస్తే ఆర్థిక వ్యవస్థలో వెనకబడతాం. అందుకే హైదరాబాద్ కంటే మెరుగైన నగరం కట్టాలని నిర్ణయించాం. ఈ 30 ఏళ్లలో ప్రపంచంలో ఎంతో అభివృద్ధి జరిగింది. టెక్నాలజీలో పెను మార్పులు వచ్చాయి. అమెరికాలో సిలికాల్ వ్యాలీ ఉంది... మరి ఇండియాలో ఏముందని అడిగే వారికి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఉందన్నదే మన సమాధానం. ఆనాడు సైబరాబాద్ నిర్మించాం. నేడు క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు ఇళ్లలో కరెంటే ఉండేది కాదు ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారు చేసుకుంటున్నాం. 1999లో నాటి అసెంబ్లీలో కరెంటు గురించే గంటల కొద్దీ చర్చలు జరిగేవి. అప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. విద్యుత్ రంగంలో మన దేశం నెంబర్ వన్ గా ఉండటం గర్వకారణం. అమెరికాలో కూడా నాలుగు గ్రిడ్ లు ఉండగా... ప్రపంచంలో సింగిల్ పవర్ గ్రిడ్ ఉండే ఏకైక దేశం మనదే. సోలార్ విండ్ పంపుడ్ స్టోరేజీకి శ్రీకారం చుడుతున్నాం. ఇంకో పదేళ్లలో గుంటూరు సహా అమరావతి ప్రాంత రూపురేఖలు ఎలా మారతాయో మీరే చూస్తారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీ ఉంటుంది. పొల్యూషన్ మాటే వినపడదు. 1995లో ఐటీని , 2000లో బయో టెక్నాలజీని ప్రమోట్ చేశాము. ఆనాడు జినోమ్ వ్యాలీకి భూములిచ్చి ప్రోత్సహించగా ఆ తర్వాత కాలంలో భారత్ బయోటెక్ కొవిడ్ వ్యాక్సిన్ అక్కడి నుంచే తయారు చేసిందని సీఎం అన్నారు.

**రాష్ట్రమంతటా సంజీవని**

టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చి నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నాం. కుప్పంలో పైలట్ ప్రాజెక్టు అయింది. త్వరలో రాష్ట్రమంతటా విస్తరించి రోల్ మోడల్ గా మారుస్తాం. కుప్పంలో 70 వేల మందికి క్లినికల్ టెస్టులు చేశాం. 2026లో డిజిటల్ హెల్త్ రికార్డులు చేయడమే కాకుండా 72 లక్షలమంది రోగుల డేటా తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం. నేడు కార్పొరేట్ ఆస్పత్రులు ఫైవ్ స్టార్ హోటళ్లను మించిపోతున్నాయి. రోగి చికిత్స ఖర్చు కంటే రూమ్ ఖర్చే ఎక్కువవుతోంది . త్వరలో ఎయిర్ అంబులెన్స్ లు వస్తున్నాయి. 2026లో డ్రోన్ అంబులెన్స్ తీసుకురావాలని అనుకుంటున్నాం. ప్రవాసాంధ్రులు అమెరికా నుంచి వర్చువల్ గా లేక ఇక్కడికి వచ్చినప్పుడు కానీ పేషెంట్లకు ట్రీట్ మెంట్ చేసి, మెరుగైన వైద్య సేవలకు తగిన సూచనలు చేయాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి సత్యకుమార్ సహా పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# సిట్ ఛార్జ్‌షీట్‌లో కల్తీ నెయ్యి స్పష్టం

డిమాండ్ చేశారు. కొంతమంది ఖాతాల్లోకి వెళ్లిన కోట్ల రూపాయల లావాదేవీలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని సిట్‌ను కోరారు. బ్యాంక్ ఖాతాల్లో కోట్ల రూపాయలు జమ కావడం వాస్తవమా? కాదా? బినామీల వెనుక అసలు పెద్దలు ఎవరో నిగ్గుతేల్చాలన్నారు. టిటిడి పవిత్రతను కాపాడేందుకు ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మీ, నరేష్‌కుమార్, డాలర్ దివాకర్ రెడ్డి, దర్శన్ పాల్గొన్నారు.

# ప్రజల సంతోషం.. సంక్షేమమే ధ్యేయంగా పని చేద్దాం...

వెళ్తున్నాం. ప్రభుత్వం చేయాలనుకున్న మంచిని ప్రజలకు చేరువ చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించాల'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.. ప్రతి అడుగులో పాదర్శకత, జవాబుదారీతనంతో పని చేస్తున్నాం.. ఇందుకు ఉద్యోగులకు కూడా అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఉద్యోగులు కూడా అంతే చిత్తశుద్ధి, జవాబుదారీతనంతో పని చేయాలని ఆశిస్తున్నామన్నారు. అలసత్వం, అవినీతికి తావులేకుండా ప్రతి ఒక్కరు పని చేయాలని నిర్దేశం చేశారు. శుక్రవారం విశాఖ కలెక్టరేట్ లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఇంజినీరింగ్ విభాగం, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద పల్లెపండగ 1.0, పల్లెపండగ 2.0, అడవితల్లి బాట, జల్ జీవన్ మిషన్ తదితర విభాగాల్లో ఇప్పటి వరకు జరిగిన పనులపై ఆరా తీశారు. గత ఏడాది నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేశారా? లేదా? పూర్తి చేయకపోతే కారణాలు ఏంటి? అనే అంశాలపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తుంది. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీల్లో స్వపరిపాలనకు చోటు లేకుండా చేసింది. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా విచ్చలవిడితనంతో ఇష్టారాజ్యంగా నిధులు దారి మళ్లించింది. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను కూడా పూర్తిగా నిర్వీర్యం చేసింది. రూ. 4 వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయి. లక్ష్యాలకు విరుద్ధంగా ముక్కలు ముక్కలుగా పైపులు వేసి వదిలేసింది. పనులు చేసినట్టు రికార్డులు చూపిస్తున్నాయిగాని, ఒక్క ఇంటికి కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ, వ్యవస్థలను బలోపేతం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఐదేళ్ల పాలనలో ఎన్నో తప్పులు చేశారు. సోషల్ ఆడిట్ విషయంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులు చేసిన వారిపై చర్యలు కూడా లేదు.

**పొగడ్తలు కాదు... పని కావాలి**

నాకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదు. పని మాత్రమే కావాలి. ఉన్నత స్థాయి అధికారి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేయాలి. ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యాన్ని, నిధుల దుర్వినియోగాన్ని సహించం. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలం అయినా, పని పట్ల నిర్లక్ష్యం వహించినా కఠినంగా వ్యవహరిస్తాం. సోషల్ ఆడిట్ కూడా మొక్కుబడిగా కాకుండా పక్కాగా జరగాలి. క్షేత్ర స్థాయిలో ఉన్న ప్రతి వ్యక్తికి అభివృద్ధి ఫలాలు అందాలి.

**నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు**

నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు, సిఫార్సులు ఉండవు. ప్రతి అధికారి నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలి. గత ప్రభుత్వంలో పని చేసిన కొంత మంది అధికారులు ఇప్పటికీ ఆ నాయకులతో సంబంధాలు కొనసాగిస్తూ.. ప్రభుత్వ పాలసీల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. పనిలో అలసత్వాన్ని అస్సలు సహించం. ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు తావులేకుండా ప్రతి ఒక్కరు నిబంధనల మేరకు మాత్రమే పని చేయాలి. పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేసేందుకు ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నాం. ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ప్రమోషన్లు ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా పూర్తి చేశాం. ఒకేసారి 10 వేల మందికి పదోన్నతులు కల్పించి మా చిత్తశుద్ధిని చాటుకున్నాం. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటున్నాం. ఉమ్మడి కడప జిల్లాలో ఓ ఎంపీడీవోపై దాడి జరిగితే వెంటనే స్వయంగా వెళ్లి భరోసా ఇచ్చాం. మీ ప్రమోషన్ల సంతోషం.. ప్రజల్లోనూ కనబడాలి. రాష్ట్ర అభివృద్ధి కోసం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మేము ఎంతో కష్టపడుతున్నాం. కేంద్ర పెద్దల మద్దతు కూడగట్టి నిధులు సాధిస్తున్నాం. మా కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు పని చేయాలి. ప్రజల సంక్షేమం, సంతోషం ధ్యేయంగా అంతా పని చేయాలి. ప్రజలకు మంచి చేయాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి మీరు తోడుగా నిలవాలి" అన్నారు. ఈ సమావేశంలో విశాఖ దక్షిణ శాసన సభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ శ్రీ షణ్ముఖ్ కుమార్, విశాఖపట్నం కలెక్టర్ శ్రీ హరేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఇంజినీరింగ్ విభాగం, గ్రామీణ నీటిపారుదలశాఖల రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధిపైనే కాదు.. దుష్ప్రచారాల రాజకీయాన్ని కూడా ఎదుర్కోండి**

2014--19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినా, వాటిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడంలో వెనుకబడ్డామని లోకేష్ గుర్తు చేశారు. అదే అప్పటి ఓటమికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రజలకు నేరుగా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. 2019లో అభివృద్ధిపై మాత్రమే దృష్టి పెట్టామని, కానీ ప్రతిపక్షం దుష్ప్రచార రాజకీయాలతో అధికారంలోకి వచ్చిందని లోకేష్ అన్నారు. ఇకపై అభివృద్ధితో పాటు, తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేసే శక్తులను ధీటుగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు.

**కూటమి నాయకుల మధ్య సఖ్యత ముఖ్యం**

కూటమి నాయకుల మధ్య సఖ్యత అత్యంత ముఖ్యమని లోకేష్ తెలిపారు. కూటమిని చీల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నా, కూటమిని విడదీయడం ఎవరి తరం కాదని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో కూటమి నేతలందరినీ కలుపుకుని కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు అలగడం తగదని, ప్రతి ఒక్కరి కష్టాన్ని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని లోకేష్ భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబం అని, కుటుంబంలో సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు.

**తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టండి**

గత వైసీపీ ప్రభుత్వం కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిందని లోకేష్ తీవ్ర విమర్శలు చేశారు. చేయకూడని పాపాలు చేసి, ఇప్పుడు కూడా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వైసీపీ దుష్ప్రచారాలతో నిండిపోయిందని,తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టండంతో పాటు ఆ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తెలుగుదేశం కార్యకర్తలదేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్త చేస్తున్న సేవలు, కష్టాలను వీఎ ఎఙూ యాప్ ద్వారా పార్టీకి తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో వీఎ ఎఙూ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ తరగతులు పార్టీని మరింత బలోపేతం చేయడంలో కీలకంగా మారతాయని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉగాదికి జాబ్ క్యాలెండర్!

రూపొందించి, వీలైనంత త్వరగా నియామక ప్రక్రియ చేపట్టాలని యోచిస్తోంది. గతేడాది జాబ్ క్యాలెండర్ వస్తుందని భావించినా అది కార్యరూపం దాల్చలేదు. అయితే ఈసారి మాత్రం ఉగాది నాటికి నిరుద్యోగుల నిరీక్షణకు తెరదించుతూ ప్రభుత్వం ఓ స్పష్టమైన ప్రకటన చేస్తుందని సమాచారం. దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఏపీ జెన్కోలో 27 మందికి కారుణ్య నియామక పత్రాలు..

మీదుగా శుక్రవారం నాడు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు విద్యుత్ శాఖలో సుమారు 500 మందికి పైగా అర్హులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యతో పాటు అన్ని అర్హతలున్న వారికి కూడా జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగాలను మాత్రమే ఇచ్చారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. కూటమి ఏర్పడిన తరువాత చేపట్టిన కారుణ్య నియామకాల్లో విద్యార్హతలను బట్టి జూనియర్ ఇంజనీర్ పోస్టులను కూడా భర్తీ చేసి వారి సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అభ్యర్థుల ఏజ్ రిలాక్సేషన్ విషయంలోనూ సానుకూలంగా స్పందించి కారుణ్య నియామకాలకు పచ్చజెండా ఊపారని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. తద్వారా బాధిత కుటుంబాలకు చెందిన ఓవర్ ఏజ్, అండర్ ఏజ్ వారికి ప్రత్యేక అనుమతులతో ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుని, ప్రతి మూడు నెలలకు ఒకసారి కారుణ్య నియామకాలు చేపడుతుందని చెప్పారు. దీనితో బాధితుల కుటుంబాలకు త్వరితగతిన ఊరట లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత విద్యుత్ శాఖ ఇన్ సర్వీస్ ఉద్యోగులతో పాటు, కొత్తగా విధుల్లో చేరిన వారికి అవసరమైన శిక్షణను విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులందరూ విధుల్లో రెట్టింపు ఉత్సాహంగా పని చేసి విద్యుత్ సంస్థలకు మంచి పేరు తీసుకు రావాలని మంత్రి సూచించారు. విద్యుత్ ఉద్యోగుల భద్రత, యోగక్షేమాలను ప్రభుత్వం చూసుకుంటుందని సీఎస్ విజయానంద్ స్పష్టం చేశారు. విధి నిర్వహణ సమయంలో ఉద్యోగులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతికతకు అనుగుణంగా స్కిల్స్ ను పెంచుకుంటూ ఉంటే పదోన్నతులు త్వరగా వస్తాయని సీఎస్ స్పష్టం చేశారు. ఇంత మంచి కార్యక్రమం చేపట్టిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కు ఉద్యోగుల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమం ఎమ్మెల్యేలు అశోక్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డితో పాటు జెన్కో డైరెక్టర్లు, విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సమగ్ర విచారణ జరపాలి

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. ఈ ప్రమాదంలో ఆయనతో పాటు ఇద్దరు విమాన సిబ్బంది, పవార్ వ్యక్తిగత భద్రత సిబ్బంది ఒకరు మరణించారు. బుధవారం ఉదయాన్నే జరిగిన ఈ దుర్ఘటన మహారాష్ట్ర ప్రజలను దిగ్భ్రాంతిలో ముంచగా, దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పొగమంచు కారణంగా దారి సరిగ్గా కనపడకపోవడంతో పవార్ ప్రయాణం చేస్తున్న లియర్‌జెట్ 45 విమానంకు రెండు సార్లు ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నించి చివరకు కుప్పకూలిందని చెబుతున్నారు. నేలకు తాకిన విమానం అగ్నిగోళంగా మారడంతో, మృతి చెందిన వారి భౌతిక దేహాలను అతి కష్టం మీద గుర్తుపట్టాల్సి వచ్చింది. తమ విమానంలో సాంకేతిక లోపమేమీ లేదని ఢిల్లీకి చెందిన ఛార్టర్ కంపెనీ విఎస్‌ఆర్ అధినేత ప్రకటించగా, పౌర విమానయాన శాఖ కూడా దాదాపుగా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉందన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ కూడా వచ్చింది. బిజెపి కూటమికి దూరంగా జరగాలని అజిత్ పవార్ ఆలోచిస్తున్నారంటూ కొంత కాలంగా జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ వచ్చిన ఈ డిమాండ్ దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ చర్చ జరుగుతుండగానే అజిత్ పవార్ చిన్నాన్న మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శరద్‌పవార్ జరిగింది ప్రమాదమేనని, దానిలో ఎటువంటి రాజకీయాలకు తావు లేదని ప్రకటించారు.

నిజానికి శరద్‌పవార్ స్థాపించిన ఎన్‌సిపి లోనే అజిత్‌పవార్ ఎదిగారు. ఆరుసార్లు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ, రాజకీయ విన్యాసాల నేపథ్యంలో ఎన్‌సిపి నుండి బయటకు వచ్చినా, చివరకు ఎన్‌సిపిని సొంతం చేసుకుని బిజెపి నేతృత్వంలోని కూటమికి భాగస్వామిగా మార్చినా ఆయన ఉప ముఖ్యమంత్రిత్వ పదవి మాత్రం పదిలంగా ఉండటం విశేషం. ఎప్పటికైనా మహారాష్ట్ర ముఖ్యమంత్రి కావాలన్నది అజిత్ పవార్ కలగా ఆయన సన్నిహితులు చెబుతారు. ఆ విషయం ఎలా ఉన్నప్పటికీ దాదాపుగా నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో శరద్ పవార్ చాటున ఉన్నా, ఆయనను ధిక్కరించి బయటకు వచ్చి, శత్రువులతో చేతులు కలిపినా, ఎన్‌సిపిని సొంతం చేసుకున్నా ప్రజానీకంలో పట్టు కోల్పోకపోవడం అజిత్‌పవార్ ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఈ ఏడాది జనవరిలో జరిగిన పూనే, పింప్రి-చించ్‌వాడ్ స్థానిక ఎన్నికల్లో శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే, అజిత్ పవార్‌లు కలసి ఉమ్మడి ఎన్‌సిపి ప్రణాళికను విడుదల చేయడం రెండు గ్రూపులు కలయికకు సంకేతంగా నిలిచింది. ఎన్‌సిపి పునరేకీకరణ అవుతుందన్న కథనాలు మీడియాలో వచ్చాయి. ఇప్పుడు ఆయన హఠాన్మరణంతో ఆయన నేతృత్వంలోని చీలిక గ్రూపు భవిష్యత్తు, బిజెపి అనుసరించే వ్యూహాలపై రకరకాల అంచనాలు వెలువడుతున్నాయి.

ఈ ఊహాగానాలు ఎలా ఉన్నప్పటికీ ఇటువంటి ఘోర ప్రమాదాల్లో రాజకీయ నాయకులు మరణించడం ఇదే మొదటిసారి కాదు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో అశువులు బాసిన తీరును తెలుగు రాష్ట్రాల ప్రజానీకం ఇప్పుడప్పుడే మరిచిపోలేరు. 2002లో అప్పటి లోక్‌సభ స్పీకర్, తెలుగుదేశం పార్టీ నేత జిఎంసి బాలయోగి మరణం కూడా ఇటువంటిదే! 1980లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ, 2001లో సీనియర్ కాంగ్రెస్ నేత మాధవరావు సింధియా, ఇలా చెప్పుకుంటూ పోతే ఈ తరహా ప్రమాదాల్లో మరణించిన ప్రముఖుల జాబితా చాలానే ఉంది! ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేయడమూ, విచారణలు నిర్వహించి చేతులు దులుపుకోవడమూ మామూలే! తాజా ప్రమాదం తరువాత దేశీయ విమాన సేవల నియంత్రణ, ప్రైవేట్ ఛార్టర్ ఆపరేటర్ల పర్యవేక్షణ వ్యవస్థలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో డిజిసిఎ, సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. ఫ్లైట్ డేటా రికార్డర్, కాక్‌పిట్ వాయిస్ రికార్డులను సేకరించి దర్యాప్తు జరుపుతున్నారు. విచారణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలి. భవిష్యత్తులోనైనా ఇటువంటి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి.

# రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్‌గా రూపొందిస్తాం

- కోకో పంటకు ఆయిల్ పామ్ పంట రీతిలో గిట్టుబాటు ధర కల్పించేందుకు కొత్త చట్టాన్ని తీసుకువస్తాం
- నాణ్యమైన కోకో ఉత్పత్తిపై రైతులకు అవగాహన కలిగిస్తున్నాం
- త్వరలో విజయవాడలో అంతర్జాతీయ హార్టికల్చర్ కాంక్లేవ్ సదస్సు నిర్వహిస్తాం
- ఉద్యానవన పంటల అభివృద్ధి దిశగా రాష్ట్రం
- ఏలూరులో రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సును ప్రారంభించిన వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు




ఏలూరు, జనవరి, 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్ గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. స్థానిక చింతలపూడి రోడ్డులోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సును మంత్రి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కోకో ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము దేశంలోనే ప్రధమ స్థానంలో ఉందన్నారు. కోకో పంటను మరింత విస్తీర్ణంలో పెంచేలా రైతులను ప్రోత్సహించేందుకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోకో ఉత్పత్తి, సాగులో తీసుకోవలసిన మెళకువలు, మార్కెటింగ్ సౌకర్యాలు, తదితర అంశాలపై అధికారులు, ఉద్యానవన శాస్త్రవేత్తలతో కోకో అభ్యుదయ రైతులకు అవగాహన కలిగించడమే రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. రైతుల ప్రతీ సమస్యను ముందుగానే తెలుసుకుని వాటి పరిష్కార దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర జిఎస్డిపి లో వ్యవసాయం 50 వేల కోట్ల రూపాయలు ఉంటె ఉద్యానవన శాఖ 1. 68 లక్షల కోట్లు ఉందన్నారు. రాష్ట్రంలో రైతులకు మంచి ఆదాయం అందించేలా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నామని, ఉద్యానవన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు, ఆటోమేషన్ అందిస్తున్నామన్నారు. విజయవాడలో అంతర్జాతీయ స్థాయిలో హార్టికల్చర్ కాంక్లేవ్ సదస్సును త్వరలో పెద్దఎత్తున నిర్వహించి ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ని ఏర్పాటు చేసి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి గత ప్రభుత్వం 7500 కోట్లు కేటాయించినప్పటికీ, 5 సంవత్సరాలలో కేవలం 1300 కోట్లు రూపాయలు మాత్రమే రైతులకు అందించిందన్నారు. తమ ప్రభుత్వం గత బడ్జెట్లో 300 కోట్లు కేటాయించి సంవత్సరకాలంలో 1200 కోట్ల రూపాయలు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి రైతులకు అందించామన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన కోకో ఉత్పత్తిపై రైతులకు అవగాహన కలిగిస్తున్నామని, పంట కోత అనంతరం కోకో గింజల నాణ్యత తగ్గకుండా ఉండేలా తీసుకోవలసిన చర్యలపై రైతులకు తెలియజేస్తున్నామన్నారు. దీని కారణంగా కోకో పంటకు మంచి ధర లభిస్తుందన్నారు. కోకో పంట సాగులో తక్కువ ఖర్చుతో, నాణ్యమైన పంట అధిక దిగుబడి, రైతుకు లాభసాటిగా ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. కోకో కాంక్లేవ్ సదస్సును శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కలిస్తారని, నాణ్యమైన కోకో ఉత్పత్తి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ప్రభుత్వ, బ్యాంకర్ల సహకారం తదితర అంశాలు కాంక్లేవ్ లో తెలియజేస్తారన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 44 వేల 984 ఎకరాలలో కోకో సాగవుతూ, 10 వేల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తితో దేశంలోనే ఏలూరు జిల్లా ప్రథమస్థానంలో ఉందన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా జిల్లా జిడిపి వృద్ధిలో లో ఉద్యానవన పంటల పాత్ర ప్రధానమైనదన్నారు. పంట కోత అనంతరం కోకో గింజల నాణ్యత తగ్గకుండా ఉండేలా తీసుకోవలసిన చర్యలపై రైతులకు అవగాహన కాలిస్తున్నామన్నారు. జిల్లాలో అదనంగా 1200 హెక్టార్లలో కోకో పంట వేసేలా 15 వేల మంది రైతులకు శిక్షణ అందించామన్నారు. నాణ్యమైన కోకో గింజల సాగుపై అధ్యాయానికి జిల్లాలోని కోకో అభ్యుదయ రైతులను కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు పంపించామన్నారు. జిల్లాలో 100 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లలో భాగంగా 7 చాకొలేట్ పరిశ్రమలు డ్వాక్రా సంఘాలచే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. . ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోకో ఉత్పత్తికి రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సులో శాస్త్రవేత్తల సూచనలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత సంవత్సరం కోకో పంటకు ధర లేనప్పుడు రాష్ట్రప్రభుత్వం కిలోకి 50 రూపాయలు అందించిందన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సు శాస్త్రవేత్తలు అందించే సూచనలతో కోకో రైతులు తక్కువ ఖర్చుతో, నాణ్యమైన కోకో అధిక దిగుబడి సాధించాలన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ కోకో ఉత్పత్తిలో దేశంలో చింతలపూడి నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలుస్తుందన్నారు. విదేశాల నుండి కోకో మొక్కలు దిగుమతి చేసుకుని వినియోగిస్తే కోకో నాణ్యతనాణ్యమైన కోకో ఉత్పత్తి సాధించి, కోకో ధరలో విదేశాలతో పోటీపడవచ్చన్నారు. చాకొలేట్ ఆరోగ్యానికి మంచిదని, యూరప్ దేశాలలో సంవత్సరానికి 9 కేజీలకు పైగా చాకొలేట్ వినియోగం ఉంటె, మన దేశంలో కేవలం కేజీ మాత్రమే వినియోగిస్తున్నారన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ దేశంలోనే అధిక కోకో ఉత్పత్తి చేస్తున్న ఏలూరు జిల్లాలో కోకో ప్రాసెసింగ్ యూనిట్లు, చాకొలేట్ పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మన దేశంలో కోకో మొక్క 3 నుండి 4 కేజీలు కోకో గింజలు ఉత్పత్తి చేస్తుంటే, విదేశాలలో 8 కేజీల వరకు దిగుబడి వస్తుందన్నారు. నాణ్యమైన కోకో ఉత్పత్తి చేస్తే కేజీకి 150 రూపాయలకు పైగా అదనంగా ఆదాయం లభిస్తుందని, ఈ దిశగా రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ కమీషనర్ కె. శ్రీనివాసులు, ఏలూరు ఉద్యానవన శాఖాధికారి సాజా నాయక్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, హార్టికల్చర్ వైస్ ఛాన్సలర్ ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, ఉద్యానవన విభాగానికి చెందిన జాతీయ సంస్థల డైరెక్టర్లు / అధిపతులు , జూజ=×, ణజజణ, చీ×ఖీజువీ-౧, ఖూఖ, జూవీూజఉ, ××ఎ=,"ూ=ఎఖ పరిశోధనా సంస్థలు మరియు సెంటర్ అఫ్ ఎక్సెలెన్స్ (జశీజు) ప్రతినిధులు మరియు ప్రముఖ జాతీయ బ్యాంకు ప్రతినిధులు,, కోకో ప్రాసెసింగ్ పెట్టుబడి దారులు, కోకో అభ్యుదయ రైతులు, ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం కోకో పంటలో అధిక దిగుబడి, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన చర్యలు, తదితర అంశాలపై ముద్రించిన కరపత్రాలను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ని, ఎమ్మెల్యే లు, జిల్లా కలెక్టర్, హార్టికల్చర్ ఉన్నతాధికారులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలు, బ్యాంకర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు.



# 4 లక్షల ఉద్యోగాలు కల్పించాం

### కాకినాడ పర్యటనలో మంత్రి నారా లోకేష్













కాకినాడ, జనవరి, 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వివిధ పరిశ్రమల ద్వారా ఇప్పటి వరకూ నాలుగు లక్షల ఉద్యోగాలు వచ్చాయని, వీటిలో 80 శాతం స్థానికులకే దక్కాయని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. కాకినాడ జెఎన్‌టియుకెలో శుక్రవారం 'హలో లోకేష్' పేరిట నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన పాదయాత్ర రాష్ట్రంలో కోట్లాది ప్రజలు, యువత ఆశలను, ఆకాంక్షలను, సమస్యలను తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. ఏ స్థాయిలో ఉన్నా నైతిక విలువలను మరువద్దని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలు ఇచ్చారు. దేశంలోనే ఉభయ గోదావరి జిల్లాలు ధాన్యాగారంగా పేరొందాయన్నారు. ఆక్వాలో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు. 18 నెలలుగా రాష్ట్రానికి అనేక పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. డిజిటల్ ట్విన్స్ ద్వారా వరదలను ముందుగా పసిగట్టే సాంకేతికతలపై దృష్టి సారించాలన్నారు. ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను వదులుకోవద్దని విద్యార్థులకు సూచించారు. వచ్చే ఏడాది ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే సివిల్ వర్క్స్ ప్రారంభించనున్నామని, పుష్కర ఘాట్లలో క్రౌడ్ మేనేజ్‌మెంట్, సౌకర్యాలపై ఎప్పటికప్పుడు తెలుసుకునేలా డిజిటల్ ట్విన్ ప్రాజెక్టును తయారు చేయాల్సిందిగా సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ఇండస్ట్రీ ఫీడ్ బ్యాక్ ఆధారంగా కరిక్యులమ్ రూపొందించి స్కిల్ గ్యాప్‌ను భర్తీచేస్తున్నామన్నారు. అనంతరం కాకినాడ జెఎన్‌టియుకెలో నందనం పేరుతో రూ.పది కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన పిజి బార్సు హాస్టల్ భవనాన్ని, రూ.21 కోట్ల యునివర్సిటీ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. జెఎన్‌టియుకె అనుబంధ కాలేజీల ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ ఫెయిర్ పేరుతో' ఏర్పాటు చేసిన 20 స్టాళ్లను లోకేష్ సందర్శించారు. వివిధ కాలేజీల విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలించారు. అనంతరం కోరమండల్ సంస్థ నిర్మించిన ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ మోహన్ రావు, ఎంపి సానా సతీష్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పి రాజశేఖర్ పాల్గొన్నారు.





తెలుగురాష్ట్రం
దినపత్రిక

# మహాశివరాత్రి వేడుకలను పటిష్టంగా నిర్వహించాలి

## -కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, జనవరి 30(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మహాశివరాత్రి పర్వదిన మహోత్సవాలను భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టంగా, విజయవంతంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో అన్ని విభాగాల అధికారులతో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదినాన జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు గోదావరి తీరం వెంబడి ఉన్న శైవక్షేత్రాలకు పుణ్యస్నానాలు, దర్శనాల కోసం తరలివస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని ఘాట్ల వద్ద మెరుగైన పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, త్రాగునీరు, షవర్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. చంటి పిల్లలతో వచ్చే తల్లుల సౌకర్యార్థం ప్రతి ఘాట్ వద్ద ఫీడింగ్ గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే ఘాట్ల వద్ద భక్తుల ప్రవేశ మార్గం, నిష్క్రమణ మార్గాలు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని, ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ప్రదేశాల్లో స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పుష్కర ఘాట్, మార్కండేయ స్వామి దేవస్థానం ఘాట్, కోటిలింగాల ఘాట్‌ల వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో మైక్ సిస్టమ్, బారికేడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అన్ని విభాగాల సమన్వయంతో మూడు షిఫ్టులలో పనిచేసే విధంగా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉండాలన్నారు. పుష్కర ఘాట్ మరియు కోటిలింగాల ఘాట్‌లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఘాట్ వద్ద అవసరమైన పడవలు, గజఈతగాళ్లు ఏర్పాటు చేయాలని, అన్ని ప్రదేశాల్లో వైద్య శిబిరాలు, అంబులెన్సులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకట రమణ, సెక్రటరీ శైలజవల్లి, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్. మూర్తి, ఎస్ఈ రీటా, మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ ఎ. వినూత్న, ఈఈ మదర్షా అలీ, మాధవి, సీఓసీ ఇన్‌చార్జ్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీకి నివాళులు



**టి. నరసాపురం, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):** సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి యావత్ భారతజాతికి స్వేచ్ఛ, స్వాతంత్రం అందించిన మన జాతిపిత మహాత్మాగాంధీ అని టి. నరసాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అద్దంకి గిరి కుమార్ తెలిపారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం సంఘ సభ్యులతో కలసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం కోశాధికారి కొనకళ్ల శ్రీను, సంఘ మాజీ అధ్యక్షులు మాదంశెట్టి మల్లిఖార్జునరావు, జూలూరి గోపి, మాజీ కార్యదర్శి అద్దంకి రవి, సభ్యులు మండం ఆదిత్య, కొనకళ్ల మోహన్ కుమార్, కొనకళ్ల కాశి, మాటూరి రవి, పమిడి పుల్లారావు, నల్లూరి శ్రీనివాస్, ఎం. రమేష్, మహాత్మాగాంధీ అభిమానులు శివయ్య, చిన్నం బుజ్జితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కొత్త పుష్కర ఘాట్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం

**కూనవరం, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):**




కాచవరం గ్రామంలో 2027లో రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చెయ్యాలని చింతూరు ఐటిడిఏ పిఓ శుభం నోక్వాల్ ను కలిసి అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ వినతి పత్రం అందజేశారు. 2027లో వచ్చే గోదావరి పుష్కరాలను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ కు మంచి పేరు తెచ్చే విధంగా ఏర్పాట్లను ఒక సంవత్సరం ముందు నుండే పక్కగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ తరుణంలో గత పుష్కరాల కంటే ఈసారి గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని, ఆ భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని కాచవరం గ్రామానికి నూతన పుష్కర ఘాట్ మంజూరు చెయ్యాలని పిఓ శుభం నోక్వాల్ కోరారు. దీనిపై పిఓ సానుకూలంగా స్పందించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు కూడా వస్తానని తెలియజేశారు.

# వైఎన్ కళాశాలలో మహాత్మానికి ఘననివాళులు






**మొగల్తూరు, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):** నర్సాపురం వైఎన్ కళాశాల గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల కోశాధికారి పోలిశెట్టి శ్రీ రఘురామారావు మాట్లాడుతూ 'ప్రపంచమంతా గాంధీ బాటలో సత్యం,శాంతి, అహింస అనే ఆయుధాలకు ప్రాముఖ్యత పెరిగిందని, శాంతి మంత్రాన్ని జపించి భారతదేశం యొక్క విధానాన్ని చాటి చెప్పడం జరిగిందని గాంధీ అధ్యయనం కేంద్రం ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా యువతలో చైతన్యాన్ని నింపుతున్నారని కొనియాడారు. మరొక ముఖ్యఅతిథిగా పాలకవర్గ సభ్యులు అకాడమిక్ రీసెర్చ్ అడ్వైజర్ రంగినీడి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ బ్రిటిష్ వారి బానిస సంకెళ్ల నుండి భారత జాతికి విముక్తి కలిగించి, స్వేచ్ఛ వాయువులను ప్రసాదించారని, గాంధీ అంటే మహత్తరమైన శక్తి అని ఉద్ఘాటించి, గాంధీ పై పాటను పాడి విద్యార్థులను చైతన్యపరిచారు. గాంధీ అధ్యయన కేంద్ర డైరెక్టర్ డాక్టర్ పులపర్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందాయని, ప్రపంచ స్థాయి నాయకులందరూ గాంధీ సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకొని గాంధీజీ ఆదర్శమని ప్రకటించినట్లు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎస్.వి రంగారావు మాట్లాడుతూ గాంధీ బోధనలు పాటిస్తే యుద్ధాలే ఉండవని రక్తపాతరహిత విప్లవం సృష్టించినట్లుగా పేర్కొన్నారు. కళాశాలలో ఉన్న గాంధీ విగ్రహానికి, శివాలయం సెంటర్లో ఉన్న బాపు విగ్రహానికి పూలమాలలు వేసి విద్యార్థులతో మానవహారాన్ని నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. కళాశాల నుండి పురవీధుల గుండా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బెజవాడ వెంకటరత్నం, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎన్. చింతారావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఆర్ పార్థసారథి, ఐక్యూఏసి సమన్వయకర్త గంధం శ్రీరామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కొప్పినీడి శేఖర్, డాక్టర్ అప్పన ఫణి, డాక్టర్ బి ఆనంద్ కుమార్, డాక్టర్ కెవిఆర్ బి వరలక్ష్మి, సోమశేఖర్, పరిమి రామకృష్ణ, సిహెచ్ఆర్ వి ఆర్ ప్రసాద్, శ్యాంబాబు, మారుతీ రావు, చింతా బాలరాజు, ఇంటి ప్రభాకర్ రావు, వీరాస్వామి, సౌజన్య డెల్స్ లీ, గంగా, వరలక్ష్మి, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంధానకర్త గా హెచ్ఆర్ డి డైరెక్టర్ చినమిల్లి శ్రీనివాస్ వ్యవహరించారు.

# లెప్రసీ ముక్త్ భారత్ లక్ష్యంగా సేవలందించాలి

## -ఇంచార్జ్ డిఎంహెచ్ఓ చలమయ్య



**కాకినాడ, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** దేశంలో కుష్ఠువ్యాధి నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్. చలమయ్య అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జీసస్ సాల్వేషన్, సోషల్ వర్క్ మినిస్ట్రీస్ కాకినాడ విముక్తి కాలనీలో యాంటీ లెప్రసీ డేను శుక్రవారం నిర్వహించింది. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ హానోక్ పుత్ర, కార్యదర్శి ఎలిజబెత్ పుత్ర పర్యవేక్షణ చేసారు. ముఖ్య అతిథిగా జిల్లా లెప్రసీ అధికారి, ఇంచార్జి జిల్లా వైద్యాధికారి డాక్టర్ చలమయ్య, అతిథిలుగా డాక్టర్ భరత్, సంస్థ వైస్ ప్రెసిడెంట్ జాకబ్ పుత్ర, డాక్టర్ గ్లోరీ శాంత, డాక్టర్ క్వీన్ గ్లోరీ, ఫిజియో తెరఫీస్ట్ ఎల్వి శ్రీనివాస్, డిపిఎంఓ జి అప్పలరాజు, పిఎంఓ ఎస్ లక్ష్మణ రావు జిల్లా స్వచ్ఛంద సంస్థల కన్వీనర్ కోన కృష్ణమూర్తిలు హాజరయ్యారు. ముందుగా జాతిపిత గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉచిత వైద్య పరీక్షలు చేసారు. నెలవారి కిట్స్ (బియ్యం, నూనె, పప్పులు) అందజేశారు. రోగులకు డ్రెస్సింగ్ మీటిరియల్ ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, కాకినాడ, రామచంద్రపురం, కాలేరు, పెద బ్రహ్మదేవం, బొమ్మూరు, రాయుడు పాకలు, కోలమూరు వంటి ప్రాంతాలలోని లెప్రసీ కాలనీలోని 375 మంది బాదితులకు సాయం అందించారు. వ్యాధి నివారణ చర్యలను వివరించారు. సమాజంలో వ్యవహరించాల్సిన విధానాలను వారు చెప్పారు.

# విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

**తాడేపల్లిగూడెం, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**



విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని మ్యాథ్స్ కేర్ వ్యవస్థాపకులు డాక్టర్ గజేంద్ర పురోహిత్ సూచించారు. ఏపీ నిట్ లోని ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ ఆధ్వర్యంలో ఇన్ సైట్స్ ఎక్స్ఛేంజ్ అనే అంశంపై రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ గజేంద్ర పురోహిత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను మరొకరితో చర్చించటం ద్వారా కొత్త కొత్త ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయని చెప్పారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ప్రతి అంశంపై అవగాహనను పెంచుకోవాలని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ ఫ్యాకల్టీ మెంటార్, ఆచార్యులు శ్రీ ఫణికృష్ణ కర్రి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి




**టి.నరసాపురం, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) మండల కార్యదర్శి తాడిగడప జయరాజు డిమాండ్ చేశారు. బికెఎంయు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా స్థానిక సెంటర్ లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ గ్రామీణ పేదలకు నోటికాడ కూడు లేకుండా చేయడం కోసం బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం వికసిత్ భారత్ జి రామ్ జి పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ పథకాన్ని రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో వీరంకి వెంకట్రావు, గంటా దుర్గయ్య, వేమన దుర్గా రావు, పొదిల సుందరం తదితరులు పాల్గొన్నారు.

# “గురురత్న” హరనాథ్ కు సన్మానం



**పెడన, జనవరి 30(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మచిలీపట్నంలో గల చారిత్రక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకులు లంకిశెట్టి కుసుమ హరినాథ్ బాబుకు గురురత్న అవార్డు లభించింది. మద్రాస్ లో ఎ.యం.ఇ టీ యూనివర్సిటీ అందించిన ఈ అవార్డును ఈ నెల 25న రిపబ్లిక్ డే సందర్భంగా అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం లేడీ యాంప్తిల్ కళాశాలలో హరినాథ్ బాబుకు ఘన సన్మానం జరిగింది. కళాశాల అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా, ఇంటర్మీడియట్ బోర్డ్ మాజీ డివైఈవో మట్ట రాధాకృష్ణా, రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శాయన సుశీల రావు, జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు, నాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ లంకెశెట్టి నీరజ, జోడుగుళ్ల చైర్మన్ దేవనూరి వీరబాబు, లేడి యాంప్తిల్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైబడి లేడీ యాంప్తిల్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు హరినాథ్ బాబు అధ్యాపక వృత్తితో పాటు సోషల్ యాక్టివిటీస్ లో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఫలితంగానే ఆయనకు గురురత్న టీచర్స్ అవార్డు లభించింది అన్నారు. దేశవ్యాప్తంగా వంద మందికి ఈ అవార్డు లభించగా సేవా కార్యక్రమాలను పరిగణలోకి తీసుకుని హరినాథ్ బాబుకు గురు రత్న అవార్డు లభించడం హర్షణీయమన్నారు. అధ్యాపక వృత్తి కే వన్నె తెచ్చే విధంగా కుసుమ హరినాథ్ బాబు గత 25 సంవత్సరాలుగా బంటుమిల్లి మచిలీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొన్ని వందల మంది పేద విద్యార్థులు ఫీజులు, యూనిఫారం, ఇతర కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి వారు జీవితంలో స్థిరపడడానికి ఎంతగానో కృషి చేశారని సాయన సుశీలరావు, మట్ట రాధాకృష్ణ అన్నారు. పదవికే వన్ని తెచ్చే విధంగా హరినాథ్ బాబు తన పదవి బాధ్యతలను కొనసాగిస్తున్నారని మోటామర్రి బాబా ప్రసాదు అన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గా సేవలు జాతి స్థాయిలో గుర్తింపు రావడం మచిలీపట్నానికి గర్వకారణం అని జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు అన్నారు.

# 22(ఎ)పై త్వరలో విధాన ప్రకటన

## రీ సర్వే2.0లో తప్పులు రాకూడదు

## రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** 22(ఎ) భూముల పూర్తిస్థాయి పరిష్కారానికి త్వరలో విధాన ప్రకటన చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.



ఇందుకోసం ఒక విధానాన్ని రూపొందించాలని ఉన్నతాధికారులకు సూచించారు. మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్, సిసిఎల్ఎ జయలక్ష్మీతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు విధానాన్ని రూపొందిస్తే ఆ తర్వాత ప్రభుత్వ స్థాయిలో చర్చించి త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ సమస్యపై మంత్రి వర్గ ఉపసంఘంలో చర్చలు జరిగాయన్నారు. జిల్లాల్లో జరుగుతున్న రెవెన్యూ క్లినిక్స్ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని, వీటిని మరింత సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా ఏ నెలలో ఉత్పన్నమైన రెవెన్యూ సమస్యలను ఆ నెలలోనే పరిష్కరించేలా రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని అనగాని గుర్తు చేశారు. భూముల రీ సర్వే2.0లో గతంలో జరిగిన తప్పులు ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ జరగకూడదన్నారు. రీ సర్వే కాలపరిమితిని 140 రోజులకు పెంచుతూ కొత్తఎస్ఓపిని విడుదల చేశామని, దాని ప్రకారం రైతులకు నమ్మకం కలిగేలా రీ సర్వే నిర్వహించాలన్నారు. రీ సర్వేలో రైతులను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. ఒక వేళ సంబంధిత రైతులు అందుబాటులో లేకుంటే సర్వేను వాయిదా వేసి వారు వచ్చిన తర్వాతే నిర్వహించాలని మంత్రి సూచించారు. ఫిబ్రవరి 2నుంచి 9వరకు పట్టాదారుపాస్‌పుస్తకాలు పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కొత్త పట్టాదారుపాస్‌పుస్తకాలు ఇచ్చే ముందు భూమి రికార్డుల వివరాలను రైతులకు, భూ యజమానులకు చూపించి వారి అనుమతితోనూ పాస్‌పుస్తకం ముద్రణకు వెళ్ళాలన్నారు. ఒక్కసారి పుస్తకం ముద్రించిన తర్వాత అందులో ఒక్క తప్పు కూడా ఉండడానికి వీల్లేదన్నారు. రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణ తీసుకురావాల్సిన అవసరాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్

# పడిలేచిన కెరటం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

## -నియోజకవర్గ సమన్వయకర్త రఘురామ్ నాయుడు



**తాడేపల్లిగూడెం, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
తాడేపల్లిగూడెం పట్టణం సవిత్రు పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు మీడియా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలందరికి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో వైకాపా చాలా బలంగా ఉందని, ఆత్మీయ సమావేశం ద్వారా తేటతెల్లమైందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, లా అండ్ ఆర్డర్ ని అదుపులో ఉంచిన ఘనత కొట్టుకే దక్కుతుందని ప్రశంసించారు. కొట్టు సత్యనారాయణ సలహాలు, సూచనలను తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలను మాత్రమే ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వంలో పూర్తి చేస్తున్నారన్నారు. బ్రహ్మానందరెడ్డి మార్కెట్ అమ్మకం అంటూ వస్తున్న వాదనలపై మండిపడ్డారు. అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. వ్యాపారస్తులు ఎవరు భయపడే పనిలేదన్నారు. వ్యక్తిగత విమర్శలకు మా దగ్గర చోటు లేదని, తాడేపల్లిగూడెం అభివృద్ధికి మేము ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో అన్యాయం ఎక్కడ జరిగినా, ప్రజలు ఇబ్బంది పడినా వైఎస్సార్ సీపీ ఖచ్చితంగా ఖండిస్తుందన్నారు. తానైనా, కొట్టు సత్యనారాయణ అయినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసమే పనిచేస్తాం తప్ప, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు తూచా తప్పకుండా పాటించడమే మా పని అని స్పష్టం చేశారు. స్థానిక కార్యకర్తలు గౌరవం మాత్రమే కోరుకున్నారన్నారు. ఎవరైనా నేరుగా తనతో మాత్రమే మాట్లాడాలని, సమస్యలు చెప్పాలని కోరారు. నియోజకవర్గంలో ప్రతీ కార్యకర్త కన్వీనర్ గానే భావించాలన్నారు. ప్రతీ కార్యకర్తను కలుస్తానని, క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిగణనలోకి తీసుకుని కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకుని అందరిని కలుపుకుని ముందుకు వెళతామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేవిధంగా పోరాటం చేస్తామన్నారు. పడిలేచిన కెరటం లాంటిది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని, మళ్ళీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం చేసిన చర్యలకు ప్రతిచర్య ఉంటుందన్నారు. ప్రభుత్వమే మద్యపానాన్ని ప్రోత్సహించడం, బెల్టుషాపులు ఏర్పాటు చేస్తూ ప్రజలను తాగుబోతులను చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తే అభినందిస్తామని, ప్రజలను మోసం చేస్తే ఖచ్చితంగా ప్రతిఘటిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు డిజిటల్ కార్డులు, ఇన్సూరెన్స్ లు అందించే విధంగా జగన్మోహన్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేషులత, జడ్పిటిసి సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గుండుమోగుల బలుసులు, మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, మాకరాజు సతీష్, రాజా త్రినాధ్, బండి నర్సి, కాకర్ల శ్రీనివాస్, పట్నాల గణపతి, బూడి దుర్గప్రసాద్, తానేటి అజయ్, చిన్నం సురేష్, వింజమూరి శ్రీనివాస్, గోకా వెంకటేశ్వరరావు, సబ్బితి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతకు సీఎం సహాయ నిధి భరోసా

## -జీలుగుమిల్లిలో రూ.5.92 లక్షల చెక్కుల పంపిణీ



**జీలుగుమిల్లి, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. శుక్రవారం జీలుగుమిల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడుగురు లబ్ధిదారులకు సుమారు రూ.5 కోట్ల 92 లక్షల రూపాయలు విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలు పేద కుటుంబాలకు ఆర్థిక భారంగా మారకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయ నిధులు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నిరంతరం ప్రజల పక్షాన నిలిచి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము పాల్గొన్నారు. కూటమి నాయకులు కోన కుమార్ బాబు, రాయి సుబ్బారావు, తమ్మన సాంబశివరావు హాజరయ్యారు. అలాగే బుడిపుట్టి చిరంజీవి, అక్కిసెట్టి విజయప్రసాద్, బొర్రా సురేష్ పాల్గొన్నారు.

# కూనవరం ప్రీమియర్ లీగ్ కు రేల ఆదివాసి టీం

## -టీమ్ కెప్టెన్ గా వినయ్

**కూనవరం, జనవరి30(తెలుగురాష్ట్రం విలేఖరి):**




కూనవరం మండల కేంద్రంలో ఫిబ్రవరి నెలలో జరగబోతున్న కూనవరం ప్రీమియర్ లీగ్ లో పాల్గొనడానికి రేల ఆదివాసి టీమ్ పేరు మీదుగా కొత్త టీంను రంగంలోకి పంపుతున్నట్లు మేనేజ్మెంట్ కమిటీ వాళ్ళు పేర్కొన్నారు. రేల ఆదివాసి టీం కెప్టెన్ గా మచ్చ వినయ్ ప్రసాద్ నియమిస్తున్నట్లు ప్రకటించారు. ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) కప్ గెలుపే లక్ష్యంగా టీం ప్లేయర్స్ తో సమన్వయం చేసుకుంటూ ముందు పోవాలని మేనేజ్మెంట్ కమిటీ కుంజా అనిల్, కోరిమిల్లి సాయి, సున్నం వెంకటేశ్వరావు, తుష్టి జోగారావు, బేతి ముత్తయ్య పేర్కొన్నారు.

# మాతా శిశు మరణాలపై విచారణకు ఆదేశాలు






**రంపచోడవరం, జనవరి 30(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
రంపచోడవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన కోటం బాపనమ్మ రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రసవం కోసం వెళ్ళింది. అయితే అక్కడ వైద్యులు చికిత్స చేస్తు రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలలోకి వెళ్ళితే కోటం బాపనమ్మ ప్రసవం కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ముందస్తు జాగ్రత్తగా పది రోజులు ముందే వెయిటింగ్ బర్త్ వెయిటింగ్ హాల్స్ నందు ప్రసవం కోసం ఉంది. అయితే అక్కడ వైద్యులు బాపనమ్మకు ఆరోగ్యం సరిగ్గా ఉందో లేదో చూడలేదు. ఈలోపు ప్రసవం తేదీ రానే వచ్చింది. వచ్చిన తర్వాత కూడా వైద్యులు సరైన పరీక్షలు చేయకుండానే, ప్రసవం చేయడం మొదలుపెట్టారు. అప్పటికే తక్కువ రక్తంతో ఉన్న ఆమెకు వైద్యులు నిర్లక్ష్యంతో ఆపరేషన్ చేయడం మొదలుపెట్టారు. దీనితో బాపనమ్మ తీవ్ర రక్తస్రావానికి గురై ఆరోగ్యం విషమించడంతో పరిస్థితి అదుపు తప్పిందని గమనించిన రంపచోడవరం వైద్యులు తమను తాము తప్పించుకోవటం కోసం మెరుగైన వైద్యం పేరుతో రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయిన ఫలితం లేకపోయింది. బాపనమ్మ మగ శిశివుకి జన్మనిచ్చి మరణించింది. శిశువు అనారోగ్యంతో ఉండటంతో కాకినాడ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే తల్లి మరణించిన మూడు రోజులకే, బిడ్డ కూడా మరణించడు. దీనితో బాపనమ్మ భర్త రాజన్నదొర, కుటుంబ సభ్యులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై స్థానికంగా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి, జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, వైద్య శాఖ ఉన్నత అధికారులు ఫిర్యాదు చేశారు. అలాగే స్థానిక రంపచోడవరం పోలీస్ స్టేషన్ లో తన భార్య బిడ్డలు మరణానికి కారుకులైన వైద్యులపై కేసు నమోదు చేయాలని రాజన్న దొర ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అటు ఉన్నత అధికారులు ఇటు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై బాధితులు తరుపున ఆదివాసి సంక్షేమ పరిషత్ ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం కూడా చేయడం జరిగిందని, బాధితులను కూర్చోబెట్టి న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన ప్రాజెక్టు అధికారి కూడా ఇప్పటివరకు బాధ్యులు అయిన వైద్యులపై, నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోపోగా బాధింపబడ్డ కుటుంబాలకు ఎటువంటి న్యాయం కూడా చేయలేదని దీన్ని తీవ్రంగా స్పందించిన ఆదివాసి సంక్షేమ పరిషత్ (274/16) జాతీయ షెడ్యూల్డ్ తెగల కమీషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్ కి ఫిర్యాదు చేశారు. స్పందించిన మూడు జాతీయ కమిషన్ లు అమరావతి కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శికి, జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్, జిల్లా ఎస్పీకి సమగ్ర విచారణకు ఆదేశించడం జరిగిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యదర్శి కుంజం శ్రీను తెలిపారు. బాపనమ్మ తనకు పుట్టిన బిడ్డ మృతికి కారుకులైన వైద్యులపై, నిర్లక్ష్యంగా వహించిన అధికారులపై కఠినమైన శిక్ష పడేవరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉద్యమాన్ని ఆపబోదని, కమీషన్లపై తమకు పూర్తి నమ్మకం ఉందని, అయినప్పటికీ ఇక్కడ కూడా న్యాయం జరగకపోతే నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన తెలిపారు.

# జర్నలిస్టులకు ఘన సన్మానం

**మొగల్తూరు, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):**




పత్రికలకు స్వేచ్ఛ ఉన్నప్పుడే ప్రజల సాధక బాధకాలు తెలపడంతో పాటు ప్రభుత్వం పని విధానాన్ని సమీక్షించడానికి వీలవుతుందని తెలుగుదేశం పార్టీ నర్సాపురం నియోజకవర్గ ఇంచార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరులో ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన భారతీయ పత్రికల దినోత్సవం వేడుకలకు రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని జర్నలిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు వ్యవహరిస్తాయన్నారు. పత్రికల ద్వారా ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి సమర్థవంతమైన పరిపాలన అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, అర్హత ఉన్న జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించే విధంగా కృషి చేస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మాజీ జెడ్పీటీసీ గుబ్బల నాగరాజు, మాజీ ఎంపీపీ కత్తిమండ ముత్యాలరావు, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి సత్యనారాయణలు మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలను కొనియాడారు. జర్నలిస్టుల హక్కులు, విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సమాజానికి జర్నలిస్టులు చేస్తున్న సేవలను గుర్తించి సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు మాట్లాడుతూ పత్రికల సామాజిక బాధ్యత అసమానమైనదని, అంత గొప్ప సామాజిక బాధ్యత నిర్వర్తించడానికి పత్రికలకు స్వేచ్ఛ అత్యవసరమన్నారు. జర్నలిస్టు సోదరులను సత్కరించే అవకాశం తమ ట్రస్ట్ కు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పొన్నాల శివ, పాము శ్రీధర్, కవురు నాగేశ్వరావు, కొల్లాటి భోగరాజు, పాల గోపాలం, గుండు మాణిక్యాలరావు మోకా ఏడుకొండలు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎలుకల నివారణతో అధిక దిగుబడులు

## -వ్యవసాయ సహాయ సంచాలకులు గంగాధర్



**తాడేపల్లిగూడెం, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
ఎలుకల నివారణతో పంట నష్టాన్ని అరికట్టి రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధర్ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం పడాలలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతులకు ఎలుకల మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాధర్ మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులందరూ భాగస్వాములై తమ పంటలను కాపాడుకోవాలని సూచించారు. రైతులు వారి పొలాల్లో ముందుగా గుర్తించిన బొరియల్లో ఎలుకల మందుని పెట్టాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. అనంతరం రైతులకు బ్రోమోడయోలిన్ ఎలుకల మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామిశెట్టి శ్రీనివాసరావు, కామిశెట్టి ఉమాశంకర్, టి.సాల్మన్ రాజు, టి.సురేష్, వరికూటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం కూటమితోనే సాధ్యం

## -కృత్తివెన్ను మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

**పెడన, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. కృత్తివెన్ను మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలతో గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అడుగులు వేస్తున్నారని కృత్తివెన్ను మండల పార్టీ అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవ రావు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి చేయాలంటే పంచాయతీ నిధులు ఒక్క రూపాయి కూడా ఉండేవి కాదని, విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామాల అభివృద్ధి రైతుల సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేవలం కృత్తివెన్ను మండలంలోని 28 కిలోమీటర్లు ఆర్ అండ్ బి రహదారులు, 22 కోట్లతో ఎన్ఆర్జిఎస్ నిధుల నుంచి సిసి రోడ్లు, 9 కోట్ల 60 లక్షలతో బీటీ రోడ్లు, 6 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి తారు రోడ్లు, అంతర్గత రహదారులు, హెల్త్ సెంటర్లు, పాఠశాల భవనాలు వంటి నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లుగా దీర్ఘకాలికంగా కనీసం రోడ్లు డ్రైనేజీ సౌకర్యాలు లేక సముద్ర తీర్ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటికి శాశ్వతంగా పరిష్కరించే దిశగా నిర్మాణాలు చేపట్టమన్నారు. సర్పంచ్ మందపాటి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పార్టీలకు ప్రజలకు అతీతంగా పని చేస్తుందన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒడుగు తులసి రావు, బీసీ చైర్మన్ నేక్కంటి భాస్కరరావు, డీసీ వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలపర్తి ప్రకాష్, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మహనీయుల కృషి వెలకట్టలేనిది

## -వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త రఘురాం



**తాడేపల్లిగూడెం, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
బ్రిటిష్ పాలకులను ఎదిరించి, తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన మహనీయుల కృషి వెలకట్టలేనిదని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు సూచించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపిత, మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూఅహింసను ఆయుధంగా, సత్యాన్ని మార్గంగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. భారతావనికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం అందించేందుకు గాంధీజీ ఎంచుకున్న శాంతి, అహింస మార్గం భారతీయులకే కాకుండా యావత్ ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచిందని ప్రశంసించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, వైసీపీ నాయకులు మాకరాజు సతీష్, పట్నాల గణపతి, బూడి ప్రసాద్, గుండుమోగుల బలుసులురావు, తానేటి అజయ్, రాంబాబు, సబ్బితి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తా

## -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్




**తాడేపల్లిగూడెం, జనవరి 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
నియోజకవర్గంలో అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని, అర్హులైన పేదలకు ఇళ్ళు నిర్మించి ఇస్తామని ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి సమీక్షా సమావేశాన్ని స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజలనుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నిధుల కొరత ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూస్తామని తెలిపారు. గోదావరి జలాలు కాలుష్యం కాకుండా ప్రజలందరూ బాధ్యత వహించాలన్నారు. పట్టణంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణాన్ని త్వరలో చేపడతామన్నారు వేసవిలో మంచినీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తిరుపతి లడ్డులో కల్తీ జరిగిందని సీట్ నివేదిక ఇచ్చినప్పటికీ వైసీపీ నేతలు బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని, వివిధ విభాగాలకు చెందిన అధికారులు కూడా ఉంటారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమం లో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎమ్మార్వో సునీల్ కుమార్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి.



**అమలాపురం( ప్రతినిధి) 30 జనవరి 2026;(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి .గన్నవరం నియోజవర్గం అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామమునకు చెందిన కాపు నాయకులు, వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్రగెడ సత్తిరాజు నాయుడు(70) ఇటీవల అనారోగ్యం గురై స్వర్గస్తులైనారు. సత్తిరాజు నాయుడు వీరవల్లి పాలెం దేవస్థానం కమిటీ చైర్మన్గా చాలా కాలం పని చేసి గ్రామస్తులు యొక్క మన్నలను పొందినారు. తమ పూర్వీకులు ముద్రగడ నాగయ్య స్థాపించిన సత్రం ద్వారా ఎంతోమందికి అన్నదాన సదుపాయాన్ని ఏర్పాటు చేసినారు. గ్రామ పెద్దగా ఉండి, కీర్తిశేషులు మంత్రివర్యులు కుడిపూడి ప్రభాకర్ రావు అనుచరులుగా పేరును పొంది కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషిచేసి వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమాని పాత్రుడుగా ఆయన మరణం అనంతరం ఆయన కుమారుడు స్థాపించిన వైయస్సార్ పార్టీలో పార్టీ అభివృద్ధికి చురుకైన పాత్రను పోషించినారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే పార్టీ రహితంగా అన్ని పార్టీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలియజేసి నివాళులు అర్పించారు .పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్, జడ్పిటిసి సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు, మండల మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్య నాయుడు, మాజీ జెడ్పిటిసి గుంగుమళకాశీ అన్నపూర్ణ శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సలాది బాబురావు, గ్రామ సర్పంచ్ సలాది బుచ్చిరాజు, మండల వైస్ ఎంపీపీ అడపా వెంకట నాగభూషణం, మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మేడిశెట్టి అంజిబాబు, సొసైటీ అధ్యక్షులు ముద్రగెడ వెంకట సత్య సుబ్బారావు, మి0డగుదుటి సిరి, జిల్లా వైయస్సార్ పార్టీ కార్యదర్శి మి0డగుదుటి రాంబాబు, మండల వైయస్సార్ పార్టీ జాయింట్ సెక్రెటరీ దామిశెట్టి వెంకటేశ్వరరావు( బుజ్జి) మేడిశెట్టి సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అడపాలక్ష్మి సూర్యనారాయణ, గ్రామ ఉపసర్పంచ్ మేడిశెట్టి రాంబాబు, అడపా వెంకట రామకృష్ణారావు, శ్రీ రెడ్డి సుబ్బారావు దామిశెట్టి చిట్టిబాబు, గ్రామ పెద్దలు, ప్రముఖులు, గ్రామ ప్రజలు తమ ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపినారు.

## తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదానికి సంబంధించి జరిగిన విషప్రచారం



**(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):అమలాపురం,** అమలాపురం, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదానికి సంబంధించి జరిగిన విషప్రచారంపై వాస్తవాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, నేడు అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ గారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం చేసిన విమర్శలు అవాస్తవమని ఇప్పటికే స్పష్టమైన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఎప్పుడూ వ్యవహరించలేదని అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ గారు పేర్కొన్నారు.స్వామివారిపై జరిగిన అపవాదు తొలగినందుకు కృతజ్ఞతగా, ఆలయ ధ్వజస్తంభం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి 200 కొబ్బరికాయలు కొట్టి స్వామి వారి పై చేసిన ప్రచారాలను అవాస్తవం అని తేల్చి చెప్పడం జరిగింది.రాజకీయం కోసం దేవాలయాలను వాడుకోవడం సరికాదని ఈ సందర్భంగా తెలియజేసిన అమలాపురం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ గారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు కుదుపూడి సూర్యనారాయణరావు గారు,బొమ్మి ఇశ్రాయేల్ గారు,రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు జిన్నూరి బాబీ గారు,రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు గారు,వంటెద్దు వెంకన్నాయుడు గారు,జడ్పీటీసీ పందిరి శ్రీహరి గారు,మరియురాష్ట్ర,జిల్లా,నియోజకవర్గం,మండలాల ముఖ్య నాయకులు,మున్సిపల్ చైర్మన్,పట్టణ అధ్యక్షులు,మండల పార్టీ అధ్యక్షులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ కమిటీలో చింతపల్లి జర్నలిస్టులకు చోటు!






**చింతపల్లి, జనవరి 30 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అల్లూరి జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీలో చింతపల్లి మండలానికి చెందిన పాత్రికేయులకు సభ్యత్వం లభించడం స్థానిక పాత్రికేయ వర్గాల్లో హర్షాతిరేకాలను రేకెత్తించింది. జిల్లాస్థాయిలో చింతపల్లి జర్నలిస్టులకు గుర్తింపు లభించడం హర్షణీయ పరిణామమని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పాత్రికేయులు అభిప్రాయపడ్డారు. చింతపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న స్థానిక ఆంధ్రప్రభ పాత్రికేయుడు దేశెట్టి సత్యనారాయణ (సతీష్), విశాలాంధ్ర పాత్రికేయుడిగా పనిచేస్తున్న షేక్ ఖాసిం వల్లి లకు అల్లూరి జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీలో సభ్యత్వం దక్కడం పట్ల ప్రత్యేకంగా అభినందనలు వెల్లువెత్తాయి. ఇది చింతపల్లి ప్రాంతానికి, ఇక్కడి జర్నలిస్టుల కృషికి లభించిన గౌరవ గుర్తింపుగా వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టులను గుర్తించడం ఆనందదాయకమన్నారు. కనీస గౌరవ వేతనం లేకపోయినా, వృత్తి పట్ల నిబద్ధతతో ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తూ, అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు వారధిగా నిలుస్తున్న పాత్రికేయుల సేవలకు ఇది నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తూ, ప్రజల గొంతుకగా పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కమిటీలో చోటు కల్పించడం అభినందనీయమని తెలిపారు. ఇకపై కమిటీలో మీడియా మిత్రుల సమస్యలపై గళం వినిపిస్తూ, వారి సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులు చొరవ చూపుతారని చింతపల్లి పాత్రికేయులు సంయుక్తంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## గొల్లవిల్లిలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు








**తేది 30 జనవరి, 2026 :(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉప్పలగుప్తం మండలం, గొల్లవిల్లిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల ఆహ్వాన పత్రికను అమలాపురం ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు శుక్రవారం ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. "అరిగెల శ్రీ రంగయ్య మెమోరియల్" పేరిట ఇండియా మెన్ అండ్ ఉమెన్ డే అండ్ నైట్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 15 నుండి 19 వరకు (5 రోజుల పాటు) గొల్లవిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం వేదికగా ఈ పోటీలు ఈ పోటీలలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి పురుషుల మరియు మహిళల జట్లు పాల్గొననున్నాయి. డే అండ్ నైట్ (పగలు మరియు రాత్రి) పద్ధతిలో ఈ టోర్నమెంట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది.పోస్టర్ విడుదల అనంతరం ఎమ్మెల్యే ఆనందరావు గారు మాట్లాడుతూ.. "గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం. గొల్లవిల్లిలో జాతీయ స్థాయి క్రీడాకారులు తలపడటం మన నియోజకవర్గానికే గర్వకారణం. క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా, క్రీడాకారులలో క్రమశిక్షణను పెంచుతాయి. ఇలాంటి గొప్ప పోటీలను నిర్వహిస్తున్న అరిగెల కుటుంబ సభ్యులకు మరియు క్రీడా కమిటీకి నా పూర్తి మద్దతు ఉంటుంది" అని తెలిపారు.

## నకిలీ ఎస్టీ సర్టిఫికెట్ల ముసుగులో గిరిజన హక్కుల దోపిడీ...తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి!

### -పెదబరడ పంచాయతీ సర్పంచ్ గోపాల్.



**చింతపల్లి, జనవరి 30 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** పెదబరడ పంచాయతీ పరిధిలో గిరిజనేతరులు నకిలీ ఎస్టీ ధ్రువపత్రాలు పొందుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అక్రమంగా దుర్వినియోగం చేస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పెదబరడ పంచాయతీ సర్పంచ్ సమిడి గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపసర్పంచ్ మాతే లోవరాజుతో కలిసి చింతపల్లి తహశీల్దార్ శంకరరావును కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. నకిలీ ఎస్టీ ధ్రువపత్రాల ఆధారంగా గిరిజనేతరులు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా మారి ఆర్థిక ప్రయోజనాలు పొందడమే కాకుండా, ఉన్నత విద్యలో రిజర్వ్డ్ సీట్లు, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు దక్కించుకుంటున్నారని ఆయన తెలిపారు. దీనివల్ల అర్హత కలిగిన నిజమైన గిరిజన యువత విద్య, ఉపాధి అవకాశాలు కోల్పోతూ తీవ్ర అన్యాయానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులను కొందరు అక్రమ మార్గాల ద్వారా లాక్కోవడం అత్యంత దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి అక్రమాలు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల పర్యవేక్షణ లోపం వల్ల నకిలీ ధ్రువపత్రాల దందా రోజు రోజుకీ పెరుగుతోందని ఆరోపించారు. రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎస్టీ ధ్రువపత్రాలపై సమగ్ర పరిశీలన జరిపించాలని, నకిలీగా తేలిన సర్టిఫికెట్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన వారితో పాటు వారికి సహకరించిన అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిజమైన గిరిజనులకు న్యాయం జరగాలంటే ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ ప్రారంభించాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు.

## అంతర్లలో నంది పండగ ఘనారంభం...

### -గిరిజన సంప్రదాయ పూజలతో ఉత్సవ శోభ!

**చింతపల్లి, జనవరి 29 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



గిరిజనుల సాంప్రదాయ విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే నంది పండగ అంతర్ల గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమైంది. గ్రామ దేవతకు అంకితంగా నిర్వహించే ఈ పండగ సందర్భంగా గ్రామమంతా పండగ వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచే గ్రామస్తులు సంప్రదాయ వస్త్రధారణతో పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ దేవత పూజారి కవడం సోమరాజు ఆధ్వర్యంలో పుట్టకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక అలంకరణ చేసి బోనాలు సమర్పిస్తూ సంప్రదాయ రీతిలో పూజలు నిర్వహించారు. నంది పండగలో భాగంగా గిరిజన ఆచారాల ప్రకారం శివాలు ఎత్తి దూర ప్రాంతాలకు వెళ్లి అక్కడి నుంచి జంబు చెట్లు, అరటి చెట్లు సహా దేవతలకు అర్పించేందుకు ఉపయోగపడే పెద్ద పెద్ద చెట్లను గ్రామ దేవత సన్నిధికి తీసుకురావడం ఆనవాయితీగా వారం రోజులపాటు ఈ పండగ కొనసాగుతోంది. ఈ సందర్భంగా గ్రామస్తులు సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు నంది దేవతకు అంకితంగా ఆటపాటలు నిర్వహించడంతో అంతర్ల గ్రామమంతా సంబరాలు అంబరాన్ని తాకాయి. గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నంది పండగ వేడుకలు ప్రారంభం కావడంతో గ్రామంలో భక్తి, ఆనందం, ఐక్యత స్పష్టంగా కనిపించాయి.



## స్ఫూర్తి దాత సత్యలింగ నాయకర్



**కాకినాడ, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ 111వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎం.ఎస్.ఎన్ చారిటీస్ కళా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రదానోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్ రథాన్ని జగన్నాథపురం వీధులలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్ షిప్స్, వస్త్రదానం, అన్నదానం చేసారు.సుమారు 2500 మంది విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, నాయకర్ అభిమానులు కార్యక్రమానికి హాజరై ఆయనకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.ఎస్.ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లాడి కార్తిక నాయకర్ మాట్లాడుతూ నాయకర్ వ్యక్తిత్వం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన సేవలు నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. మల్లాడి సత్యలింగ నాయకర్ సమాజానికి స్ఫూర్తిదాతగా నిలిచారని, విద్యాసంస్థల అభివృద్ధికి తమ వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్, కారస్పాండెంట్ చాగంటి సురేష్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో సంపన్నులు చాలా మంది ఉన్నప్పటికీ సంపాదించిన సంపదను సమాజహితార్థం వినియోగించి వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులు చాలా అరుదని, అలాంటి అరుదైన మహాత్ముల్లో మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ ఒకరని కొనియాడారు. దాతృత్వం, సేవాభావం, మానవతా విలువలు, విద్యా ప్రోత్సాహం -- ఈ నాలుగు లక్షణాలకు ఆయన జీవితం సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు నులుకుర్తి సత్యసాయి, రాళ్లపూడి ప్రకాష్, పి.దుర్గాప్రసాద్, పి. లక్ష్మీప్రసన్న, ఎం. త్రిలోచన, ఎం.చిన్ని, అరదాడి భవాని, ఓలేటి దుర్గ, డి. సూర్యభగవాన్, పి. రాంజీ, ఎం. దుర్గాప్రసాద్, ఎం. రాజు, అరదాడి శివ, సూపరింటెండెంట్ జె. సోమరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్. సుబ్రహ్మణ్యం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. గంగాధర్, వేద పాఠశాల పండితులు ఈ.టి.వి.అవధాని, పాఠశాల పూర్వ విద్యార్థులు, పదవీ విరమణ చేసిన సిబ్బంది పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**జీలుగుమిల్లి, జనవరి 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):** జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం నుండి జీలుగుమిల్లి వరకు సుమారు రూ.1 కోటి 50 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శుక్రవారం పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో రోడ్డు మౌలిక సదుపాయాలు కీలకమని అన్నారు.ఈ రోడ్డు నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.వంకవారిగూడెం నుంచి జీలుగుమిల్లి వరకు ప్రయాణం మరింత సులభమవుతుందని పేర్కొన్నారు.గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము,సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు,కూటమి నాయకులు తమ్మన సాంబశివరావు, దుర్గారావు, పసుపులేటి ప్రసాద్, స్థానిక సర్పంచ్, సంబంధిత అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతన పంచాయతీ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు






**(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే తుమ్మలపల్లి గ్రామంలో అన్ని హంగులతో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించుకున్నామని స్థానిక ఎమ్మెల్యే ఆనందరావు పేర్కొన్నారు.గురువారం తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించి భవనాన్ని ఘనంగా ప్రారంభించిన గౌరవ ఎమ్మెల్యే ఆనందరావు గారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు గారు మాట్లాడుతూప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకముగా అందించడానికే ఈ నూతన భవన నిర్మాణం చేపట్టడం జరిగింది.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మరియు తాగునీటి సౌకర్యాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించామని తెలిపారు.ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు మరియు గ్రామ ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే గారిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.





# ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే ఆనందరావు






**తేది 30 జనవరి, 2026 : (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని తక్షణమే పరిష్కరించాలనే లక్ష్యంతో అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే ఆనందరావు గారి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గారు శుక్రవారం "ప్రజా దర్బార్" నిర్వహించారు.



నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఆయన స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 78 అర్జీలను ప్రజలు ఎమ్మెల్యే గారికి అందజేశారు. ఇందులో ప్రధానంగా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు, డ్రైనేజీ సమస్యలు మరియు వ్యక్తిగత ఆరోగ్య సమస్యలకు సంబంధించిన విన్నపాలు ఉన్నాయి. వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే గారు సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, నిబంధనల మేరకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు గారు మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన చేరాలనేది మన కూటమి ప్రభుత్వ ధ్యేయం. ప్రజా దర్బార్ ద్వారా సామాన్యుడి గొంతును వినే ప్రయత్నం చేస్తున్నాం. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు.అధికార యంత్రాంగం మరియు ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అమలాపురం నియోజకవర్గాన్ని సమస్యల రహితంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గారు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.







CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

### ఆ వయసులోపు పిల్లలపై

# సోషల్ మీడియాను బ్యాన్ చేయండి

### ప్రధానికి సోనూసూద్ రిక్వస్ట్



హైదరాబాద్ : 16 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధం విధించాల్సిన అవసరం ఉందని బాలీవుడ్ సినీనటుడు సోనూసూద్ పేర్కొన్నారు. సోషల్ మీడియా వినియోగంపై ఎక్స్ వేదికగా ఓ పోస్టును పెట్టారు. ఈ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో పిల్లలు భోజనం చేస్తూ కూడా ఫోన్లు స్క్రోలింగ్ చేస్తున్నారని, ఆ విషయాన్ని తల్లిదండ్రులు సైతం పట్టించుకోకపోవడం పట్ల సోనూసూద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. ఇది మన భవిష్యత్తు కాకూడదని హెచ్చరించారు. ఈ క్రమంలోనే 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియాను దూరం చేయడం తక్షణ అవసరమని అన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేసిందని, త్వరలో గోవా ప్రభుత్వం కూడా దీనిని అనుసరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనిని ఒక జాతీయ ఉద్యమంగా మార్చాలని గౌరవ ప్రధాని నరేంద్ర మోడిని కోరుతూ... పిల్లల మానసిక ఆరోగ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సోనూసూద్ సూచిస్తూ పోస్టులో పేర్కొన్నారు.

# పేరు మార్చుకోనున్న సమంత?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. గతేడాది డిసెంబర్ నెలలో బాలీవుడ్ ఫిలిం మేకర్ రాజ్ నిడిమోరుతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు.. ఈ వివాహం అత్యంత సన్నిహితుల మధ్య, సాదాసీదాగా కోయంబత్తూర్‌లోని సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆధ్వర్యంలో ఉన్న ఈషా ఫౌండేషన్‌లో జరిగింది. వివాహం తర్వాత కూడా సమంత తన ప్రొఫెషనల్ జీవితంలో యాక్టివ్‌గా ఉంటూ కొత్త సినిమాలపై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు, తన పేరును సమంత మళ్లీ మార్చుకుంటున్నారు. సమంత అసలు పేరు సమంత రూత్ ప్రభు. ఇప్పుడు రాజ్ నిడిమోరును పెళ్లి చేసుకున్న సమంత.. తన పేరు చివర తన భర్త ఇంటిపేరును తన పేరు చివర చేర్చుకోవాలని నిర్ణయించుకున్నారట. సమంత ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' చిత్రంలో నటిస్తున్నారు. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి.. రాజ్ నిడిమోరు క్రియేటర్ గా, సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా టైటిల్స్ లో సమంత పేరును సమంత నిడిమోరుగా ప్రదర్శించబోతున్నట్టు సమాచారం.

# 'భగవంతుడు' మూవీ టీజర్ రిలీజ్




టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు'. పల్నాడు నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామా టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళీధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## పాత్ర విషయంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ మోసం చేశాడు: ఈషా రెబ్బా

ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పై హీరోయిన్ ఈషా రెబ్బ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్రివిక్రమ్ తనను మోసం చేశాడని ఆమె అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'అరవింద సమేత..' సినిమా గురించి మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ చిత్రంలో ఈషా క్యారెక్టర్ రోల్ లో నటించింది. ఆ సమయంలో తనకు ఎన్నో సందేహాలు ఉన్నాయని... ఒక కమర్షియల్ సినిమాలో సైడ్ క్యారెక్టర్స్ చేస్తే భవిష్యత్తులో కూడా తనకు అలాంటి పాత్రలే వస్తాయేమోనని భయపడ్డానని చెప్పారు. అయితే తనది ప్రధానమైన పాత్ర అని త్రివిక్రమ్ చెబితే ఓకే చెప్పానని అన్నారు. పెద్ద బ్యానర్, పెద్ద డైరెక్టర్ కావడంతో నో చెప్పలేకపోయానని తెలిపారు. అయితే, సినిమా విడుదలైన తర్వాత పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని... సినిమాలో నీ పాత్ర ఏముందని తనకు చాలా మంది ఫోన్ చేశారని చెప్పారు. మంచి పాత్ర అని చెప్పి, ప్రాధాన్యత లేని క్యారెక్టర్ ఇచ్చి తనను త్రివిక్రమ్ మోసం చేశాడని అన్నారు. మంచి సినిమాలో అవకాశం వచ్చినందుకు సంతోషించాలో, ప్రాధాన్యత లేని పాత్ర చేసినందుకు బాధపడాలో అర్థం కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది.

# నెల రోజుల్లోపే ఓటీటీలోకి 'ది రాజాసాబ్'..

## స్ట్రీమింగ్ ఎప్పుడు, ఎక్కడంటే..?

టాలీవుడ్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, దర్శకుడు మారుతి రూపొందించిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్' ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ఈ నెల 9న థియేటర్లలోకి వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న ఈ హారర్ కామెడీ చిత్రం, విడుదలైన నెల రోజుల లోపే డిజిటల్ స్ట్రీమింగ్‌కు రానుండటం గమనార్హం. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్ ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను అత్యంత భారీ ధరకు సొంతం చేసుకుంది. ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 'ది రాజాసాబ్' తమ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉంటుందని సంస్థ అధికారికంగా ప్రకటించింది. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లోనూ ఈ సినిమాను వీక్షించవచ్చు. థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినప్పటికీ, ప్రభాస్‌ను వింటేజ్ లుక్‌లో చూడాలనుకునే అభిమానుల కోసం ఈ చిత్రం ఓటీటీలో వినోదాన్ని పంచేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ కీలక పాత్రల్లో నటించారు. ఇక సినిమా కథ విషయానికొస్తే.. మతిమరుపు (అల్జీమర్స్) వ్యాధితో బాధపడే తన నాయనమ్మ (జరీనా వహాబ్) కోసం, ఆమెను విడిచి వెళ్లిపోయిన భర్త కనకరాజు (సంజయ్ దత్)ను వెతకడానికి మనవడు రాజాసాబ్ (ప్రభాస్) బయలుదేరతాడు. తన తాత ఓ పాడుబడిన రాజమహల్‌లో ఉన్నాడని తెలుసుకుని అక్కడికి వెళతాడు. ఆ మహల్‌లో అతనికి ఎదురైన విచిత్ర అనుభవాలు, తన తాత గురించి తెలిసిన సంచలన నిజాలు ఏంటనేదే ఈ సినిమా కథాంశం. నాయనమ్మ కోసం రాజాసాబ్ చేసిన పోరాటమే ఈ హారర్ కామెడీ చిత్రానికి ప్రధాన ఆకర్షణ.







# 'వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్

## అధికారికంగా ప్రకటించిన రాజమౌళి

ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'వారణాసి' విడుదల తేదీని దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి అధికారికంగా ప్రకటించారు. సూపర్ స్టార్ మహేశ్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం వచ్చే ఏడాది, అంటే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కొంతకాలంగా ఈ సినిమా విడుదల తేదీపై ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ, శుక్రవారం చిత్ర బృందం దీనిపై స్పష్టతనిచ్చింది. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి తన ఎక్స్ ఖాతాలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకుంటూ, "2027... ఏప్రిల్ 7... చవూా=ూాచీూాూా×" అని పోస్ట్ చేశారు. దాదాపు అదే సమయంలో మహేశ్ బాబు కూడా ఇదే పోస్ట్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీంతో సినిమా విడుదలపై వస్తున్న అన్ని రకాల ప్రచారాలకు తెరపడినట్లయింది. గత ఏడాది హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో వేలాది మంది అభిమానుల సమక్షంలో ఈ సినిమా టైటిల్‌ను అట్టహాసంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఈ చిత్రానికి 'గ్లోబ్‌ట్రాటర్' అనే వర్కింగ్ టైటిల్ ప్రచారంలో ఉండేది. భారత సినీ చరిత్రలోనే అతిపెద్ద ఫ్యాన్ ఈవెంట్‌లలో ఒకటిగా నిలిచిన ఆ కార్యక్రమంలో, సినిమా కోసం ఏర్పాటు చేసిన 100 అడుగుల ఎత్తు, 130 అడుగుల వెడల్పు గల భారీ స్క్రీన్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా



'మందాకిని' పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే ప్రతినాయకుడి పాత్రలో ప్రేక్షకులను భయపెట్టనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి ఫస్ట్ లుక్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో రాజమౌళి మాట్లాడుతూ, సినిమాలోని ఒక కీలక ఎపిసోడ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "చిన్నప్పటి నుంచి నాకు రామాయణం, మహాభారతం అంటే ఇష్టమని చెప్పాను. మహాభారతం తీయాలన్నది నా కల. కానీ ఈ సినిమా కోసం రామాయణంలోని ఒక ముఖ్యమైన ఘట్టాన్ని చిత్రీకరిస్తానని ఊహించలేదు. మహేశ్ బాబును రాముడి గెటప్‌లో చూసినప్పుడు నాకు ఒళ్ళు గగుర్పొడిచింది" అని అన్నారు. ఆ ఎపిసోడ్‌ను సుమారు 60 రోజుల పాటు చిత్రీకరించామని, ప్రతి రోజు ఒక సవాల్‌గా అనిపించిందని, తన కెరీర్‌లోనే ఇది అత్యంత గుర్తుండిపోయే సన్నివేశాల్లో ఒకటిగా నిలుస్తుందని రాజమౌళి ధీమా వ్యక్తం చేశారు. తాజా ప్రకటనతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339